మరమ్మతులు మరిచారు..!

గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం దుస్థితి ఎవరికీ పట్టడం లేదు. గత వైసీపీ హయాంలో ఐదేళ్లు ఈ పథకం నిర్వహణ గాలికొదిలేశారు. ఆ తర్వాత వచ్చిన కూటమి పాలనలో కూడా అదే స్థితే. ప్రాజెక్టుకు కాపలాదారులు (వాచ్ అండ్ వార్డ్) లేరని గుర్తించిన దొంగలు రాత్రికిరాత్రే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానల్ బోర్డులు ధ్వంసం చేసి కాపర్‌వైరు, పవర్ ఆయిల్ దోచుకెళ్లారు. మరమ్మతులకు రూ.17.05 కోట్లు ఇవ్వాలని గతేడాది నవంబరు 1న ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఎస్‌డీఎంఎఫ్ కింద రూ.1.28 కోట్లు ఇస్తే తాత్కాలిక మరమ్మతులతో సరిపుచ్చారు. శాశ్వత మరమ్మతులు కాగితాలకే పరిమితమయ్యాయి. తుంగభద్రకు ముందస్తు వరదొచ్చినా మెట్ట పొలాలకు ఎత్తిపోయలేని దైన్య పరిస్థితి. ఈ ఏడాదైనా మరమ్మతులు చేయకపోతే 30,585 ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారనుంది.



మాధవరం స్టేజ్-1 పంప్‌హౌస్

- గురు రాఘవేంద్ర ప్రాజెక్టు విద్యుత్ పంపులు, ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ
- కాపర్ వైరు దోచుకెళ్లిన దుండగులు
- మరమ్మతులకు రూ.17.05 కోట్లతో ప్రతిపాదనలు
- 30,585 ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం?
- తుంగభద్రకు ముందే వరదొచ్చినా ఎత్తిపోసుకోలేని దైన్యం


కర్నూలు, మే 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం అంటే గుర్తుకొచ్చేంది కరువు.. వలసలు. తుంగభద్ర చెంతనే ప్రవహిస్తున్నా కరువు రైతులకు కన్నీటి కష్టాలు తప్పడం లేదు. యేటేటా వందల టీఎంసీలు కృష్ణాలో కలసి సముద్రం పాలవుతున్నా మెట్టచేలకు మళ్లించలేని దైన్యపరిస్థితి ఉంది. తుంగభద్ర జలాలు ఎత్తిపోస్తే కరువు నేలలో పసిడి పంటలు పండించవచ్చని 2003లో టీడీపీ ప్రభుత్వం గుర్తించింది. అప్పటి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే, ఉమ్మడి రాష్ట్ర మంత్రి బీవీ మోహన్‌రెడ్డి సీఎం చంద్రబాబును ఒప్పించి గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును సాధించారు. ఫేజ్-1 కింద రూ.177 కోట్లు మంజూరు చేయించారు. తుంగభద్ర వరద జలాలు 3.786 టీఎంసీలు ఎత్తిపోసి మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 66,815 ఎకరాలకు సాగునీరు అందించే 9 ఎత్తిపోతల పథకాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టి పూర్తి చేశారు. 2005లో ప్యాకేజీ-97 కింద రూ.65.21 కోట్లతో నాలుగు లిఫ్టులు, రూ.255 కోట్లతో పులికనుమ లిఫ్టు, రూ.119 కోట్లతో పులకుర్తి ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. అందులో పులికనుమ, పులకుర్తి లిఫ్టులు 15 ఏళ్లు కాంట్రాక్ట్ సంస్థ నిర్వహించాలి. మూగలదొడ్డి, బసలదొడ్డి, పులచింత, మాధవరం, చిలకలడోణ, సోగనూరు, దుద్ది లిఫ్టులు జలవనరుల శాఖ, కృష్ణదొడ్డి, రేమట, మునగాల, కంబదహాల్, చింతమానుపల్లె ఎత్తిపోతల పథకాలు ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఐడీసీ) పర్యవేక్షణలో ఉన్నాయి. పంప్ హౌస్‌ల వద్ద రూ.కోట్లు ఖర్చు చేసి విద్యుత్ పంపులు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. గత వైసీపీ హయాంలో వీటి నిర్వహణకు ఐదేళ్లు ఒక్కపైసా నిధులు ఇవ్వలేదు. ఆపరేటర్లు, కాపలా సిబ్బంది (వాచ్ అండ్ వార్డు) కూడా లేరు. వేసవి సమయంలో అటువైపు ఇంజనీర్లు కన్నెత్తి చూడడం లేదు. దోపిడీ దొంగలకు ఇది అనుకూలంగా మారింది.

మహారాష్ట్రకు చెందిన దోపిడీ దొంగలు..

గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు పంప్‌హౌస్‌ల వద్ద కాపలాదారులు లేరని గుర్తించిన మహారాష్ట్రకు చెందిన దోపిడీ దొంగలు రెక్కీ నిర్వహించి లిఫ్టుల పంప్‌హౌస్ తలుపులు బద్దలుకొట్టి హెచ్‌టీ, హెల్‌టీ ప్యానల్ బోర్డులు, స్టార్టర్లు, పంప్‌హౌస్‌ల పక్కనే ఉన్న 1000 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్ వైర్, కాయిన్స్ పవర్ ఆయిల్ దోచుకెళ్లారు. మూగలదొడ్డి, మాధవరం స్టేజ్-1, స్టేజ్-2, బసలదొడ్డి స్టేజ్-1, చిలకలడోణ స్టేజ్-1, స్టేజ్-2, సోగనూరు స్టేజ్-1, పులచింత స్టేజ్-1, స్టేజ్-2 ఎత్తిపోతల పథకాలు పంప్‌హౌస్ దగ్గర ఏర్పాటు చేసిన 1000 కేవీ విద్యుత్ 14 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేశారు. మాధవరం స్టేజ్-1 లిఫ్ట్‌లో హెచ్‌టీ, ఎల్‌టీ ప్యానల్ బోర్డులు, స్టార్టర్లు, బలసదొడ్డి స్టేజ్-1 పంప్‌హౌస్‌లో ప్యానల్ బోర్డులు ధ్వంసం చేసి విలువైన కాపర్ వైర్, కాయిన్స్, పవర్ ఆయిల్ దోచుకెళ్లారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా ఎత్తిపోతల పథకాలను పరిశీలించిన కడప జిల్లాకు చెందిన ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సంస్థ ఎండీ శివశంకర్‌రెడ్డి ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు పనికిరావని, కొత్తది ఏర్పాటు చేయాలని జీఆర్‌పీ ఇంజనీర్లకు నివేదిక ఇచ్చారు. జీఆర్‌పీ లిఫ్టుల్లో దోపిడీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. మహారాష్ట్రకు చెందిన ఐదుగురు దొంగలు ఈ దోపిడీలో పాల్గొన్నట్లు గుర్తించారు. వారిలో ఇద్దరిని అరెస్టు చేసి రూ.15-20 లక్షల విలువైన కాపర్‌వైర్‌ను రికవరీ చేశారు. నెలలు గడిచినా మరమ్మతులు మాత్రం చేయలేదు.



గతేడాది గురురాఘవేంద్ర ప్రాజెక్టు మాధవరం స్టేజ్-2 ఎత్తిపోతల పంప్‌హౌస్‌లో దుండగులు ధ్వంసం చేసిన ప్యానల్ బోర్డులు(ఫైల్)



బసలదొడ్డి లిఫ్ట్ పంప్‌హౌస్

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాల్లో గతేడాది దొంగలు పడి హెచ్‌టీ, హెల్‌టీ ప్యానల్ బోర్డులు, స్టార్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి కాపర్, పవర్ వైర్ దోచుకెళ్లారు. దీనిపై సంబంధిత పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశాం. ఎస్‌డీఎంఎఫ్ నిధులతో అత్యవసరమైన తాత్కాలిక మరమ్మతులు చేశాం. శాశ్వత మరమ్మతులు, నిర్వహణ కోసం రూ.17.05 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే మరమ్మతులు చేపడుతాం. రైతులకు ఇబ్బందులు లేకుండా ఒక పంపుతో తుంగభద్ర జలాలు ఎత్తిపోసేలా ఏర్పాట్లు చేశాం.
- బాలచంద్రారెడ్డి, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ, కర్నూలు



మూగలదొడ్డి లిఫ్ట్ పంప్‌హౌస్

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి



ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం కరువు, వలసలు నివారించాలనే లక్ష్యంగా గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. బసలదొడ్డి లిఫ్ట్ కింద మాకు ఆయకట్టు ఉంది. గత ఐదేళ్లుగా నిర్వహణ సక్రమంగా లేదు. దొంగలు పడి విద్యుత్ పంపులు, ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి విలువైన కాపర్, పవర్ ఆయిల్ వంటివి దోచుకెళ్లారు. ప్రభుత్వం నిధులు ఇచ్చి మరమ్మతులు చేపట్టి తుంగభద్ర జలాలు ఎత్తిపోయాలి.
- లక్ష్మయ్య, ఆయకట్టు రైతు, మాలపల్లి, మంత్రాలయం మండలం

రూ.17.05 కోట్లు ఇవ్వండి

దోపిడీ దొంగలు ధ్వంసం చేసిన గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు శాశ్వత మరమ్మతులు చేయలేదు. అలాగే.. 2024 ఏప్రిల్ నుంచి జూలై వరకు పంపులు ఆపరేట్ చేయలేదు. 2023-24లో నిధుల కొరతతో పంప్ హౌస్‌ల్లో ఎలక్ట్రో-మెకానికల్ మరమ్మతు కూడా చేపట్టలేదు. దీంతో పలు లిఫ్టులు ఒక్క పంపుతోనే నీటిని ఎత్తిపోయాల్సి వస్తుంది. దీనికి తోడు ఐదేళ్లుగా నిధులు లేమితో ఆపరేటర్లు, వాచ్ అండ్ వార్డ్ సిబ్బంది లేకపోవడం నిర్వహణ ఎండమావిగా మారింది. గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎదుర్కొంటున్న మరమ్మతులు, నిర్వహణ సమస్యలపై గత ఏడాది జూన్ 25న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ (వీసీ)లో మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు యంత్రాల అత్యవసర మరమ్మతు కోసం ప్రతిపాదనలు పంపితే.. అదే ఏడాది అక్టోబరు 10న రూ.1.28 కోట్లు ఎస్‌డీఎంఎఫ్ నిధులు ఇచ్చారు. అత్యవసర మరమ్మతులు చేపట్టారు. శాశ్వత మరమ్మతుల కోసం రూ.17.05 కోట్లు నిధులు ఇవ్వాలని 2024 నవంబరు 1న ఉమ్మడి కర్నూలు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా రాష్ట్ర జలవనరుల శాఖకు ప్రతిపాదనలు పంపారు. నెలలు గడుస్తున్నా నిధులు ఇవ్వలేదు. మరమ్మతులు చేయకపోవడంతో ఆయా లిఫ్టుల కింద 30,585 ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. తుంగభద్రలో ముందుగానే వరద మొదలైనా ఎత్తిపోసి కరువు నేలకు మళ్లించలేని పరిస్థితి ఉంది. ఎమ్మిగనూరు, కోడుమూరు ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి సీఎం చంద్రబాబును ఒప్పించి నిధులు మంజూరు చేయించాలి. జీఆర్‌పీ లిఫ్టులు మరమ్మతులు, నిర్వహణ బాధ్యతలు పక్కాగా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎత్తిపోతల పథకాల వారీగా మరమ్మతులకు అవసరమైన నిధులు (రూ.కోట్లల్లో), ఆయకట్టు (ఎకరాల్లో) వివరాలు

ఎత్తిపోతల పథకం	అంచనా వ్యయం	అయకట్టు
మూగలదొడ్డి	1.53	3,793
బసలదొడ్డి	2.66	6,450
పులచింత	3.93	4,400
మాధవరం	2.14	4,211
చిలకలడోణ	2.25	4,083
సోగనూరు	3.64	4,648
దుద్ది	0.89	3,000
మొత్తం	17.05	30,585

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

రాఘవేంద్ర స్వామి దర్శనానికి మూడు గంటల సమయం

మంత్రాలయం, మే 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దేశ నలుమూలల నుంచి దర్శనార్థం వచ్చిన భక్తులతో మార్మోగింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో శ్రీమఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు అశేష భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అన్నపూర్ణ భోజనశాల, మహా ముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, పోలీసులు, సెక్యూరిటీ ఆధ్వర్యంలో శ్రీమఠం ప్రాంగణంలో క్యూలైన్లు అదనంగా ఏర్పాటుచేశారు. ప్రసాదాల కొరత రాకుండా ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దర్శనం మూడు గంటలు సమయం పట్టింది. మఠం ప్రాంగణంలో నలుదిక్కులూ పీఠాధిపతి ఆదేశాల మేరకు తొక్కిసలాట జరగకుండా శ్రీమఠం అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.



భక్తులతో రద్దీగా ఉన్న శ్రీమఠం ప్రాంగణం

ఉద్యోగుల్లో ఉత్కంఠ

- కొందరిలో బదిలీల గుబులు
- ఐదేళ్లు దాటిన వారికి తప్పనిసరి..
- కీలక పోస్టులకు పైరవీలు
- ఎవరి స్థాయిలో వారు ముమ్మర ప్రయత్నాలు

నంద్యాల, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీ చేయడంతో పలు శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉత్కంఠ మొదలైంది. ఇదే క్రమంలో బదిలీల హడావిడి సైతం ఆయా శాఖల్లో లేకపోలేదు. ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారితో పాటు రిక్వెస్ట్ బదిలీలకు అవకాశం కల్పించడం ఆయా ఉద్యోగుల్లో అలజడి రేపుతోంది. ఈ నేపథ్యంలో కొందరు ఉద్యోగులు సైతం సిఫార్సుల కోసం తమదైన శైలిలో పైరవీలు మొదలెట్టారు. దీంతో ఎవర్ని ఎక్కడికి బదిలీ చేస్తారో..? అనే టెన్షన్ నెలకొంది. ప్రధానంగా కీలక పోస్టులు ఇన్‌చార్జి పాలనలో సాగుతుండటంతో పాటు అదనపు బాధ్యతలు ఇదివరకే అప్పగించారు. తాజాగా ప్రభుత్వం బదిలీలకు శ్రీకారం చుట్టడంతో ఆయా కీలక పోస్టింగ్‌లకు రెగ్యూలర్ ఉద్యోగులను నియమిస్తారా..? లేక.. ఇతరత్రా కారణాలతో యథావిధిగా ఇన్‌చార్జి అధికారులనే కొనసాగిస్తారా..? అనే సందేహాలు ఆశాఖ వర్గాల్లో లేకపోలేదు. కొన్ని శాఖల్లో కొందరు ఉద్యోగులైతే..



ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని రెవెన్యూ, పీఆర్, జిల్లా పరిషత్, గ్రామ వార్డు సచివాలయాలు, విద్యుత్, హౌసింగ్, వ్యవసాయ, ఆర్‌అండ్‌బీ, మార్కెటింగ్ శాఖ, రిజిస్ట్రేషన్, రవాణాశాఖ, కమర్షియల్ ట్యాక్స్, మున్సిపల్ శాఖల ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. ఈ క్రమంలో కొందరైతే తమకు నచ్చిన స్థానాల కోసం ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ కడుతుండటం గమనార్హం. ఏది ఏమైనా ప్రభుత్వ ఉత్తర్వులతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఉద్యోగుల బదిలీ కానున్నారు. ఈ క్రమంలో కొందరు ఉద్యోగుల్లో బదిలీ ఫీవర్ పట్టుకుంటే.. మరికొందరు ఉద్యోగుల్లో మాత్రం తమను ఏ స్థానాలకు బదిలీ చేస్తారో..? అని భయాందోళన మొదలైంది. ప్రధానంగా కొన్ని శాఖల్లో

కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది కావస్తున్నా.. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం చుట్టకపోవడంతో ఉద్యోగులు ఉత్కంఠగా ఎదురుచూశారు. కొన్ని శాఖల్లో కొందరు ఉద్యోగులైతే.. బదిలీల జీవో కోసం వేచి ఉండలేక.. తమదైన శైలిలలో పైరవీలు చేసి సిఫార్సులతో బదిలీ చేయించుకున్నారనే విషయం తెలిసిందే. ఇక మిగిలిన వారు మాత్రం నిరాశగా ఎదురుచూడాల్సిన దుస్థితి. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీచేయడంతో ఆయా శాఖలవారీగా ఆయా ఉద్యోగుల్లో తమకు ఎలాంటి స్థానం దక్కు తుందోనని ఆసక్తి నెలకొంది.

మిగతా 7వ పేజీలో

కమ్మేసిన మేఘాలు.. కుమ్మేసిన వానలు

- పులకరించిన నగరం ● రహదారులు జలమయం
- స్తంభించిన జనజీవనం ● జీవాలకు అందుతున్న జలం
- పల్లెసీమల్లో ముందస్తు సాగుకు సిద్ధం ● అన్నదాతల హర్షం



బళ్లారి చౌరస్తా వద్ద నగరాన్ని కప్పేసిన మేఘాలు

కర్నూలు, మే 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంపై ఆదివారం మధ్యాహ్నం మేఘాలు కమ్మేశాయి. నీలాకాశంలో కారుమబ్బులు కనువిందు చేశాయి. ప్రజలు ఆసక్తిగా చూశారు. బళ్లారి చౌరస్తా, రాజ్‌విహార్ సర్కిల్ దగ్గర హంద్రీ నదిపై దట్టమైన మేఘాలు కుండపోత వర్షం కురిసేందుకు సిద్ధం అన్నట్లుగా కదులుతున్నాయి. వర్షానికి సంకేతంగా మేఘాల నుంచి చిరుజల్లులు నేలను తాకుతున్నాయి. రోడ్లపై జనం, వాహనదారులు సురక్షిత ప్రాంతాలకు చేరుకుందామని వేగంగా సాగిపోతున్నారు. అంతలోనే చిరు జల్లులు జడివానై కుమ్మేసింది. భారీ వానలతో నగరం తడిసిముద్దయ్యింది. రహదారులు జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించిఇంది. రుతపవనాలు ముందుగానే తీరం దాటడంతో జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రోహిణి కార్తె ప్రారంభం కావడంతో రోళ్లు పగిలే ఎండలతో వాతావరణ వేడెక్కుంతుందని జనం భయపడిపోయారు. ముందస్తు వానలతో నగరం పులకరించింది. వారం పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా అంతటా వాతావారణ చల్లబడింది. జిల్లాలో మే నెల సాధారణ వర్షపాతం 29.7 మిల్లీమీటర్ల కాగా.. ఇప్పటికే 82.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే 172 శాతం అధిక వర్షాపాతం నమోదయ్యింది. 2009 తరువాత దాదాపు 15 ఏళ్లకు మే నెలలో హంద్రీ, వేదావతి, తుంగభద్ర నదులకు వరద చేరాయని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. వాగులు, వంకలు పొంగిపోర్లాయి. తీవ్ర ఎండలతో నెర్రలిచ్చే పలు చెరువులు ముందస్తు వర్షాలకు వర్షపు నీటితో నిండుతున్నాయి. పశువులకు తాగునీటి సమస్య తీరుతుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సగటున 9.1 మిల్లీ మీటర్లు వర్షం పడి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, పత్తికొండ ప్రాంతాల్లో ఎర్రమట్టి నేలల్లో దుక్కులు జోరు పెంచారు. మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కురుస్తున్న భారీ వర్షాలకు దశాబ్దాలుగా నీడనిచ్చిన మహా వృక్షాలు నేలకూలుతున్నాయి. అదే క్రమంలో ముందస్తు వ్యవసాయ ప్రణాళిక తయారీలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.



మధ్యాహ్నం భారీ వర్షంతో రైల్వేస్టేషన్ వద్ద ఎక్కడి వాహనాలు అక్కడే



వర్షం నీటితో కళకళలాడుతున్న హొళగుంద మండలం కల్లివంక చెరువు

కౌన్సెలింగ్ ప్రశాంతం

40 మంది హెల్త్ అసిస్టెంట్లకు స్థానాల కేటాయింపు

కర్నూలు హాస్పిటల్, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు (మేల్) కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఆదివారం ఉదయం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ ఆధ్వర్యంలో 40 మంది ఎంపీహెచ్‌ఏ (ఎం)లకు కౌన్సెలింగ్ నిర్వహించి స్థానాలను కేటాయించారు. ఎంపీహెచ్‌ఏ (మేల్)లను వెంటనే రిలీవ్ చేయాలని, కొత్త స్థానానికి సోమవారం రిపోర్టు చేయాలని డీఎంహెచ్‌వో ఆదేశాలు జారీ చేశారు. శనివారం సీనియారిటీ జాబితాను విడుదల చేసి ఒక్క రోజు వ్యవధిలో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించడం విశేషం.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో శాంతికళ

కర్నూలు అర్బన్‌లో 13 స్థానాలు, ఎమ్మిగనూరు అర్బన్‌లో 2, ఆదోని అర్బన్‌లో రెండు, డెంగీ, మలేరియా ఉన్న ప్రాంతాలను ఎంపీహెచ్‌ఏ (ఎం)లకు కేటాయించారు. మరో 22 పీహెచ్‌సీలకు స్థానాలను కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేశారు. ఎంపీహెచ్‌ఏ (మేల్)లు పాత స్థానాల నుంచి రిలీవ్ అయి కొత్త స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని అన్నారు. డీఎంవో ఏ.నూకరాజు, డీఐవో డా.నాగప్రసాద్, కార్యాలయ ఏవో కే.అరుణ, ఆఫీసు సూపరింటెండెంట్ పత్తి కొండ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్లు లోకసాయి, మధుసూదన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

మొత్తంగా తమకు బదిలీ రానుందనే విషయం మాత్రం ఆయా ఉద్యోగులకు స్పష్టత వచ్చినట్లైంది.

త్వరలో ఉత్కంఠకు తెర..

ప్రభుత్వ బదిలీ ఉత్తర్వులు ప్రకారం జూన్ 3వ తేదీ లోపు ఉత్కంఠకు తెరపడనుంది. ఇప్పటికే ఆయా శాఖల ఉన్నతాధికారులకు ప్రభుత్వం తమదైన పరంగా ఆదేశాలు జారీ చేసింది. తగిన జాబితా కూడా సిద్ధమైనట్లు ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. జూన్ 2వ తేదీ లోపు బదిలీ పక్రియ పూర్తిచేయాల్సి ఉంది. ఈనేపథ్యంలో కొందరు ఉద్యోగులు సైతం ప్రజాప్రతినిధుల వద్దకు సిఫార్సుల కోసం ప్రదక్షిణలు చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా.. గత వైసీపీ ప్రభుత్వంలో సానుకూలంగా ఉన్న అధికారులకు మాత్రం బదిలీ ఫీవర్ పట్టుకుంది. తమను దూర ప్రాంతాలకు బదిలీ చేస్తారేమో? అనే ఆందోళన మొదలైంది. దీంతో సదరు ఉద్యోగులు కూడా కూటమి నాయకుల వద్దకు క్యూ కట్టారని సమాచారం. ఇదే తరహాలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సైతం ఎక్కువ సంఖ్యలో బదిలీ కానున్నట్లు సమాచారం.

వ్యవసాయశాఖలో పైరవీలు

- ఎమ్మెల్యే, మంత్రుల ఇళ్లకు క్యూ
- రూ.10లక్షల నుంచి రూ.20లక్షల డిమాండ్
- నేడు బదిలీల కౌన్సెలింగ్
- అనంతపురం తరలివెళ్లిన వ్యవసాయాధికారులు

కర్నూలు అగ్రికల్చర్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ శాఖలో చేపడుతున్న బదిలీల్లో పైరవీలు కొనసాగుతున్నాయి. ఐదేళ్లు పూర్తిచేసుకున్న మండల వ్యవసాయాధికారులతో పాటు ఏడీఏలు ఎలాగైనా మంచి స్థానాన్ని దక్కించుకోవాలని రెండు రోజులుగా రాజకీయ నాయకులు, రాష్ట్ర ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యమైన స్థానాల కోసం ఎంత మొత్తమైన నాయకులకు చెల్లించేందుకు సిద్ధమయ్యారు. తమకు తెలిసిన చోటా మోటా నాయకుల ద్వారా మంత్రులు, ఎమ్మెల్యేలను కలిశారు. ఉమ్మడి జిల్లాలోని మండల వ్యవసాయాధికారులు, ఏడీఏలు, సూపరింటెండెంట్లు దాదాపు 150 మంది కోరుకున్న చోటుకు బదిలీ చేయించుకునేందుకు కౌన్సెలింగ్ కోసం అనంపురం బయలుదేరి వెళ్లారు.

రాయలసీమ జోన్ పరిధిలోని..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, నంద్యాల, ఆదోని, డోన్, బనగానపల్లె, పత్తికొండ నియోజకవర్గాల్లోని మండల వ్యవసాయాధికారుల పోస్టింగుల కోసం నాయకుల వద్ద క్యూ కట్టారు. రాయలసీమ జోన్ పరిధిలోని ఉమ్మడి కర్నూలు జిల్లా కడప, అనంతపురం, జిల్లాలో పని చేసే మండల వ్యవసాయాధికారులు, ఏడీఏల బదిలీ ప్రక్రియ సోమవారం అనంతపురంలోని వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయంలో జరిగేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో పని చేసే అసిస్టెంట్ డైరెక్టర్ కృపానందం బదిలీ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు చేపట్టేందుకు పర్యవేక్షించనున్నారు. ఉమ్మడి జిల్లాలో కాసులు కురిపించే నియోజకవర్గ కేంద్రాలు, మండల వ్యవసాయాధికారుల కార్యాలయాలకు బదిలీ చేయించుకునేందుకు వారం రోజులుగా రాజకీయ అధికార పార్టీ నాయకుల ఇళ్ల వద్ద వ్యవసాయాధికారుల రాకపోకలతో హడావుడి ఎక్కువైంది. కొంత మంది నాయకులు కోరుకున్న చోటకు బదిలీ చేయిస్తామని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల దాకా వ్యవసాయాధికారుల వద్ద పంచాయితీ పెట్టినట్లు సమాచారం. పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చుకున్నా ఏడాది తిరిగేసరికల్లా ఆ డబ్బును రాబట్టుకోవచ్చని డీలర్ల నుంచి ముక్కుపిండి వసూలు చేయవచ్చని కొంత మంది మండల వ్యవసాయాధికారులు, ఏడీఏలు ధీమాతో ఉన్నారు.



కల్లూరు మండల వ్యవసాయ కార్యాలయం

పిల్లల్లో సాహిత్యాభిరుచి పెంచాలి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు కూడా అవసరం
- ప్రాంతీయ చరిత్ర, సంస్కృతిపై అధ్యయనాలు జరగాలి
- ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, సాహితీవేత్త తెలకపల్లి రవి




కర్నూలు కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతిని పరిరక్షించుకోవాలంటే పిల్లల్లో సాహిత్యంపై అభిరుచి పెంచాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, సాహితీవేత్త తెలకపల్లి రవి అభిప్రాయపడ్డారు. శనివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రానికి విచ్చేసిన ఆయనతో 'ఆంధ్రజ్యోతి' కలిసినప్పుడు పలు విషయాలపై ఆయన స్పందించారు. పలు సాహిత్య సామాజిక అంశాలపై తెలకపల్లి రవి మనోభావాలు.. ఆయన మాటల్లోనే...

- డిటెక్టివ్ సాహిత్యంలో అగ్రగణ్యుడైన రచయిత షర్లాక్ హోమ్స్ స్ఫూర్తితో 1917లోనే కర్నూలులో ఉయ్యాలవాడ రామచంద్రరావు 'చతురిక' అనే నవల రాశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం గ్రంథాలయంలోని పుస్తకాల డిజిటల్ కాపీలు ఆన్‌లైన్‌లో తిరగేస్తుండగా ఇది కనిపించడం నిజంగా అనూహ్యమే. ఈ నవలకు సంబంధించిన విశేషాలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. 1917లో కర్నూలులోని చంద్రమౌళీశ్వర ముద్రాక్షరశాల అధినేత ఎస్వీ రాఘవయ్య ఈ ప్రచురణకు ప్రేరణగా నిలువడమే కాకుండా సంపాదకుడిగానూ వ్యవహరించారు. కర్నూలు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన నరహరి గోపాలకృష్ణ చెట్టి 1872లో వెలువరించిన 'శ్రీరంగరాజ చరిత్రము' మొదటి నవల కాగా, 1878లో కందుకూరి వీరేశలింగం ప్రచురించిన 'రాజశేఖర చరిత్ర' రెండో నవల. అయితే చతురిక నవల రాష్ట్ర సాహితీ స్రవంతి విశేష కానుకగా సేకరణ, కూర్పుతో ముద్రించాం. ఈ కోణంలో ప్రాంతీయ సంస్కృతి, ఇక్కడి పురాతన కట్టడాలు, చరిత్రకు సంబంధించిన అంశాలను లోతుగా అధ్యయనం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

మా తండ్రి నర్సింహయ్య ప్రోత్సాహం...

నాబాల్యం, చదువు ఇక్కడే కొనసాగింది. 1968-75 మధ్య నెహ్రూ మెమోరియల్ హైస్కూల్, ఉస్మానియా కళాశాలల్లో చదువుకున్నాను. అలాగే మాతండ్రి కమ్యూనిస్టు పోరాటయోధుడు తెలకపల్లి నరసింహయ్య సాహిత్యం బాగా చదివేవారు. ఆయన భర్తృహరి శుభాషితాలు చదివి చెప్పేవారు. వాటి అర్థాన్ని మాతో అధ్యయనం చేయించేవారు. సాహిత్యం విప్లవోద్యమానికి ఎలా అన్వయించుకుంటామో తెలిపేవారు. అలా 1970 దశకంలో శ్రీశ్రీ, దాశరథి, కరుణశ్రీ, గజ్జల మల్లారెడ్డి, రాజన్న కవి, గడియారం వారు వంటి మహామహులతో పరిచయం ఉండేది. మా ఇంటికి వారి రాకపోకల సందర్భంగా వారి మధ్య జరిగే చర్చలను వింటూ పెరిగాను. అలాగే 1974లో నేటి గడియారం ఆసుపత్రి వద్ద ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో, శ్రీనివాస క్లాత్ మార్కెట్ వద్ద ఉండే సాయి గ్రంథాలయంలో చాలా మంచి పుస్తకాలు అందుబాటులో ఉండేవి. అప్పట్లో తెలుగు సాహిత్యం ఇక్కడ బాగా ఆదరణ పొందింది. అనేక మంది అరసం, విరసం కవులు కర్నూలుకు వచ్చేవారు.



విద్యార్థి దశ నుంచే సాహిత్యంపై ఆసక్తి...

1973లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు జడ్పీ కార్యాలయ ఆవరణలో జరిగాయి. నేను కళాశాల స్థాయిలో ఎస్ఎఫ్ఐలో ఉంటూ రాసిన కవితే నాకు సాహిత్యంలో ప్రేరణను ఇచ్చింది. 'విద్యార్థీ...అర్థం కాలేదా పద్యం...తలకెక్కలేదా గద్యం' అనే కవిత రాసి వినిపించాను. అది ఎస్ఎఫ్ఐ పత్రికలో వేశారు. అలా ఆనాటి సాహిత్య సభలు, ప్రముఖుల పరిచయాలతో మంచి పుస్తకాలు చదవడం అలవాటైంది.

సాహితీ స్రవంతి ద్వారా కార్యక్రమాలు..

రాష్ట్ర వ్యాప్తంగా సాహితీ స్రవంతి ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. యోగి వేమన సామాజిక కోణంలో తెలిపిన అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి మంచి ఫలితం సాధించాం. అలాగే సామాజిక ఉద్యమకారుడు బసవేశ్వరుని జీవితం, ఆయన బోధనలు కూడా సమాజంలోనికి విస్తృతంగా తీసుకు వెళుతున్నాం. విద్యాలయాలు, వైద్యాలయాలు, గ్రంథాలయాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలి. పిల్లలకు ఇంగ్లీషు మీడియంతో పాటు తెలుగు భాష చక్కగా నేర్పించాలి.

విధులు ముగించుకొని వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం



సాత్రీశేఖర్ (ఫైల్)

ఆళ్లగడ్డ/ చాగలమర్రి, మే 25(ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకొని వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓకానిస్టేబుల్ దుర్మణం చెందాడు. ఈఘటన ఆళ్లగడ్డ సమీపంలో చోటు చేసుకున్నట్లు ఆళ్లగడ్డ పోలీసులు తెలిపారు. వివరాలు.. కోవెలకుంట్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు కానిస్టేబుల్‌గా శేఖర్(34) పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులు ముగించుకొని మోటార్‌సైకిల్‌పై తిరిగివెళ్తున్నాడు. ఫోన్ రావడంతో బైక్‌ను పక్కకు ఆపారు. ఇంతలో వెనుక నుంచి పాల వాహనం ఢీకొట్టింది. దీంత కానిస్టేబుల్ శేకర్ తలకు బలమైన గాయమైంది. తీవ్ర రక్తస్రావం కావడంతో నంద్యాల ఉదయానంద ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. బైక్ నడుపుతున్న అనిరుధ్‌కు రక్తగాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా శేఖర్ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

గౌరవ వందనం..

ఎస్పీ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్, సిబ్బంది మద్దూరు గ్రామానికి చేరుకొని శేఖర్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి గౌరవ వందనం చేశారు. గాలిలోకి మూడురౌండ్లు కాల్పులు జరిపి ఘన నివాళి అర్పించారు. అంతిమ యాత్రగా కానిస్టేబుల్ మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్య క్రియలు చేశారు. అనంతరం అంత్యక్రియల నిర్వహణకై ప్రభుత్వ సాయం కింద మంజూరైన రూ.25 వేలు డీఎస్పీ మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. శేఖర్ కుటుంబానికి పోలీస్ శాఖ తరుపున రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందించారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, చాగలమర్రి ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు

ఎమ్మెల్యే నివాళి

రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమై మృతిచెందిన కానిస్టేబుల్ శేఖర్ మృతదేహానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె శేఖర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి అందాల్సినవని తనే దగ్గరుండి ఏర్పాటుచేస్తానని భరోసా ఇచ్చారు.

యువకుడి బలవన్మరణం

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

నంద్యాల టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): పెళ్లికావడంలేదని మన స్థాపంతో ఉరేసుకొని ఓయువకుడు బలవనర్మణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నంద్యాలలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. నంద్యాల మండలంలోని కొత్తపల్లెకు చెందిన రాముడు(29) రెండునెలల క్రితం శ్రీనివాస్‌నగర్‌లోని తృప్తి మెస్‌లో వంట మాస్టర్‌గా చేరాడు. అదే మెస్‌పైన ఓగదిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. పెళ్లి కావడం లేదని తీవ్ర మన స్థాపం చెందాడు. రెండు రోజుల నుంచి గది నుంచి కిందకు రాలేదు. దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఆదివారం పోలీసులకు సమాచారమిచ్చారు. గదిని తెరిచి చూడడగా బాడీ ఉబ్బిపోయి దుర్వాసన వస్తుంది. పోలీసుల మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి సుజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మహానాడును విజయవంతం చేద్దాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించుకునే మహానాడును విజయవంతం చేద్దామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పలువురు నాయకులకు మహానాడుకు హాజరు కావడానికి నాలుగు రకాల ఎంట్రీ పాసులను అందజేశారు. స్టేజీ పాసులు, వీవీఐపీ, వీఐపీ, వాహనాల పాసులను అందజేశారు. జిల్లాలోని నాయకులకు రాష్ట్ర కార్యాలయం పంపిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.



కార్పొరేటర్ పద్మలతకు ఎంట్రీ పాసులను అందిస్తున్న తిక్కారెడ్డి

ఎన్టీఆర్ పురస్కారం అందుకున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, నందిఅవార్డు గ్రహీత, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య ఎన్టీఆర్ పురస్కారం అందుకున్నారు. ఆదివారం రాత్రి పల్నాడు జిల్లా సాతులూరులోని నటరత్న ఎన్టీఆర్ జాతీయస్థాయి నాటకోత్సవ వేడుకల్లో పత్తి ఓబులయ్యకు ఎన్టీఆర్ పురస్కారంను నరసరావుపేట ఎమ్మెల్యే చదవలవాడ అరవింద్‌బాబు అందజేశారు. కార్యక్రమంలో నడింపల్లి వెంకటేశ్వరరావు, బుర్ర నరసయ్య, చదలవాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి ఓబులయ్యకు ఎన్టీఆర్ పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమిద్దాం

సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు ఎంఏ గఫూర్

కర్నూలు న్యూసిటీ, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రజా వ్యతిరేక పాలకుల నుంచి రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు చేద్దామని సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు ఎంఏ. గఫూర్ పిలుపునిచ్చారు. నగరంలోని కేకే భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఎం జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్, మతతత్వ అజెండాతో ఉద్యోగులు, కూలీలపై ఆర్థిక పీడనను పెంచి అప్పులయ్యేలా చేసి కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని పెంచుకునేలా చేసిందన్నారు. ఈ నేపథ్యంలో వర్గ, ప్రజా, సామాజిక పోరాటలను మరింత తీవ్రతరం చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, జి.రామకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు ఎంఏ గఫూర్

తప్పిన పెను ప్రమాదం

- హైవే నుంచి కిందకు దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు
- పది మందికి స్వల్ప గాయాలు
- ఊపిరి పీల్చుకున్న మిగతా ప్రయాణికులు



హైవే నుంచి కిందకు దూసుకెళ్లిన బస్సు

నంద్యాల టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిద్రమత్తులో ఓ ప్రైవేటు బస్సు హైవే నుంచి కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటన నంద్యాల టోల్‌ప్లాజా వద్ద చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న శ్రీవారి ప్రైవేటు ట్రావెల్స్ ఏసీ బస్సు ఆదివారం తెల్లవారుజామున నంద్యాల టోల్‌ప్లాజా వద్ద కిందకు దూసుకెళ్లింది. డ్రైవర్ నిద్రమత్తులో కిందకు వెళ్లినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ బస్సులో సుమారుగా 40 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు కిందకు దిగడంతో 10 మందికి స్వల్పగాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. గాయపడ్డ వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. క్షతగాత్రులంతా హైదరాబాద్‌కు చెందినవారే. పెను ప్రమాదం తప్పడంతో మిగతా ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

డోన్ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఓవ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ బిందుమాధవి తెలిపారు. వివరాలు.. డోన్‌లోని రైల్వేస్టేషన్‌లో పట్టణంలో నెహ్రూనగర్‌కు చెందిన చంద్రమోహన్(42) అనే వ్యక్తి రైలు కింద పడి మృతిచెందాడు. మృతుడి వివరాలు సేకరించి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమసమాజం కోసం ఉద్యమాల్లోకి..

- 'కగార్'లో అమరురాలైన కామ్రేడ్ సంగీత
- పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లా బకాష్

కర్నూలు, మే 25 (ఆంధ్రజ్యోతి): దోపిడీ, పీడనలు లేని సమసమాజం కోసం మావో యిస్టు ఉద్యమంలోకి వెళ్లిన మావోయిస్టు కామ్రేడ్ లలిత అలియాస్ సంగీత ఆపరేషన్ కగార్‌లో భాగంగా సైనికులు జరిపిన దాడుల్లో అమరురాలైందని పౌర హక్కుల సం ఘం జిల్లా కార్యదర్శి అల్లా బకాష్ పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పరి మండలం ములుగుందం గ్రామంలో దళిత సామాజికవర్గానికి చెందిన దుబ్బన్న, ఏస్తేరమ్మ దం పతుల కుమార్తె లలిత. నర్సింగ్ చేసిన ఆమె ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్లిందని తెలిపారు. అక్కడ కుల నిర్మూలన పోరాట సమితిలో కీలకంగా మారి దళిత హక్కుల కోసం పనిచేసిందని వివరించారు. ఆక్రమంలోనే మావోయిస్టు ఉద్యమంతో పరిచ యాలు పెరిగి, పార్టీ కార్యకర్తగా అజ్ఞాతంలోకి వెళ్లిందన్నారు. 20 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేసిందని వివరించారు. ఇటీవలే అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లలిత అలియాస్ సంగీత మృతిచెందిందన్నారు. ఆమె మృతదేహం కోసం సోదరులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్‌కు వెళ్లారని, అక్కడి పోలీసులు మృతదేహం అప్పగిం చ లేదన్నారు. ఆమె మృతదేహం రాగానే అంత్యక్రియలు స్వగ్రామం ఆస్పరి మండలం ములుగుందంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌డీపీఐ నాయకులు జహంగీర్, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, విరసం బాధ్యులు నాగేశ్వర ఆచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లా బకాష్

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులతో క్రీడా జట్లు

ఓర్వకల్లు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలను రవికుమార్ జ్ఞాపకార్థం సందర్భంగా నిర్వహించారు. మొదటి విజేత కర్నూలు జట్టుకు రూ.40వేలు, రెండో విజేత హుశేనాపురం జట్టుకు రూ.30వేలు, మూడో విజేతకు హుశేనాపురం జట్టు రూ.20వేలు, నాలుగో విజేత బ్రాహ్మణకొట్కూరు జట్టుకు రూ.10వేలు నగదును దాతలు అందజేశారు.

యోగా శిక్షణను వినియోగించుకోండి


యోగా కార్యక్రమంలో నగర పాలక కమిషనర్

కర్నూలు అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిషనర్ ఎస్. రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం ఆయన బిర్లాకాంపౌండ్ సమీపంలోని ఖానా ఖజాన వద్ద నిర్వహించిన యోగా ఆసనాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో బహుళ ప్రజయోజనాలు చేకూరతాయని, యోగా సాధనతో మానసిక, శారీరక ఆరోగ్యం, ఎంతో మెరుగుపడుతుందని, రోగ నిరోధక శక్తి పెంచుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు యోగాను రోజు వారిజీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, డీఈఈ గిరిరాజు, పారిశుధ్య తనిఖీదారుడు అనిల్ పాల్గొన్నారు.

మైనార్టీల హక్కులను పరిరక్షించాలి

కర్నూలు అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): దేశ రాజ్యాంగం మైనార్టీ హక్కులను పరిరక్షించాలని ఏఐఎంపీఎల్‌బీ కన్వీనరు మౌలానా జాకీర్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వక్ఫ్ రక్షించండి రాజ్యాంగాన్ని కాపాడండి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, ముస్లింలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి


నన్నూరులో రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఓర్వకల్లు, మే 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ విద్యాసాగర్ సూచించారు. ఆదివారం మండలంలోని పూడిచెర్ల, నన్నూరు, కేతవరం, ఓర్వకల్లు, తదితర రేషన్ షాపులను ఆయన తనిఖీ చేసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలను ప్రభుత్వం రద్దు చేయడంతో షాపుల వద్దనే రేషన్ పంపిణీ చేయాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఆటంకం లేకుండా పంపిణీ జరగాలన్నారు. తూకాల్లో తేడాలు లేకుండా అందించాలనీ డీలర్లకు సూచించారు.

ప్రశాంతంగా మెడికల్ అకాడమీ ఎంపిక పరీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, మే 25 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరులో నిర్వహించిన ఐబీటీ మెడికల్ అకాడమీ ఎంపిక పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 540 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 418 మంది హాజరయ్యారు. ఈ పరీక్ష నిర్వహణను జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, డైరెక్టర్ ఉమా మహేశ్వరప్ప, ప్రిన్సిపాల్ మహానంది, పీఎస్ఎన్ మూర్తి, వేణుగోపాల్ పర్యవేక్షించారు. ఎంపిక పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ ప్రకారంగా ఐబీటీ మెడికల్ అకాడమిలో సీట్లు ఎంపిక జరుగుతుందని జిల్లా కోఆర్డినేటర్ తెలిపారు.

మూడో పట్టణ సీఐని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 25(ఆంధ్రజ్యోతి): కవిత రాసినందుకు సీపీఎం నాయకుడిపై తప్పుడు కేసు పెట్టిన మూడో పట్టణ సీఐ శేషయ్యను సస్పెండ్ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కే.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి టీజీ భరత్ తండ్రి టీజీ వెంకటేష్‌కు చెందిన టీజీవి ఎస్ఆర్ఏసీ పరిశ్రమలో కాలుష్యంపై కవిత రాసినందుకు సీపీఎం నాయకుడు వి.వెంకటేశ్వర్లును స్టేషన్‌లో నిర్బంధించి తప్పుడు కేసుపెట్టడం సరికాదన్నారు. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను ఇవ్వాలని, ఇందిరమ్మ గృహాలపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలన్నారు.

'తప్పిపోయిన పిల్లలపై నిర్లక్ష్యం వద్దు'

కర్నూలు హాస్పిటల్, మే 25 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో తప్పిపోయిన పిల్లలపై నిర్లక్ష్యం వహించరాదని ఐసీడీఎస్ పీడీ పి.నిర్మల తెలిపారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసు ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం నైస్ కంప్యూటర్ సెంటరులో నేషనల్ మిస్సింగ్ చిల్డ్రన్స్ డే కార్యక్రమం పీడీ మాట్లాడుతూ ఇప్పటికి కూడా ఆడ, మగ పిల్లలు తమ తల్లిదండ్రులు తిట్టారని, కొట్టారన్న కారణాలతో పారిపోవడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో వారు ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి బస్సులో గానీ, రైళ్లలో గానీ ప్రయాణం చేసేటప్పుడు పొరపాటు సంఘ విద్రోహ శక్తులకు దొరికితే పిల్లల బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. ఇలా తప్పిపోయిన పిల్లల్ని గుర్తించి 24 గంటలలోపు జిల్లా బాలల సంక్షేమ సమితి ముందు హాజరు పరిచి వారి ఆదేశాల మేరకు తాత్కాలిక షెల్టర్‌లో ఉంచడం జరుగుతుందన్నారు. పిల్లలు చెప్పే వివరాలను నమోదు చేసుకుని ఆ వివరాలన్నింటినీ ట్రాకింగ్ మిస్సింగ్ చైల్డ్ అనే పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారిణి టి.శారద, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ లీగల్ రైట్ కమిటి సభ్యులు రాయపాటి శ్రీనివాసులు, డీసీపీయూ సిబ్బంది పాల్గొన్నారు.

సోమయాజులపల్లెలో యోగాంధ్ర క్యాంపెయిన్

ఓర్వకల్లు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లె బస్ స్టేజీ సమీపాన ఉన్న బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మ్యూజియంలో సోమవారం యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆదివారం తెలిపారు. ఓర్వకల్లు రాక్‌గార్డెన్ వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమం అనివార్య కారణాలతో రద్దు చేయడం జరిగిందని, అయితే ఈ కార్యక్రమం సోమయాజులపల్లె బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మ్యూజియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

యాదవ చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వరుణ్‌కుమార్ యాదవ్


ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న వరుణ్‌కుమార్ యాదవ్

కర్నూలు న్యూసిటీ, మే 25(ఆంధ్రజ్యోతి): యాదవులు అన్నిరంగాల్లో రాణించాలని యాదవ చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వరుణ్ కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో వేదిక రాష్ట్ర కార్యదర్శి నాగజ్యోతి అధ్యక్షతన ఉత్తమ ప్రతిభ కనబరచిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌కుమార్ మాట్లాడుతూ యాదవులు చైతన్యవంతులై ప్రతిఒక్కరూ చదువుకోవాలన్నారు. యాదవుల్లో ఐక్యత లేదని, అందరూ చెబుతుంటారని కానీ ఐక్యత లేకపోయిన ప్రేమానురాగాలు ఉన్నాయన్నారు. ఎక్కడో ఉన్న యాదవుడు ముఖ్యమంత్రి అయితే ఇక్కడ సంబరాలు జరుపుకుంటున్నామని అన్నారు. జిల్లాలో యావులకు ఒక ఎమ్మెల్యే, ఎంపి సీటు కూడ దక్కకపోవడం బాధాకరమన్నారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థులు భవిష్యత్తులో సైంటిస్టులుగా మంచి నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి మల్లికార్జు యాదవ్, ఆర్ఆర్ హస్పటల్ అధినేత డా.బాలమద్దయ్య యాదవ్, రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి, డా.జీవి.కృష్ణయాదవ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్, జిల్లా మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

7నుంచి శ్రీకూర్మ క్షేత్రంలో జయంతి ఉత్సవాలు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ, ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆస్పరి మండలం, హలిగెర గ్రామంలో శ్రీరసాగర మథన ఘట్ట విశేషాలను సంతరించుకున్న స్వయంభూ నల్లగుట్ట శ్రీకూర్మ క్షేత్రంలో జూన్ 7నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న శ్రీకూర్మ జయంతి వేడుకల ఆహ్వాన పత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల భరతమాత దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యంస్వామి మాట్లాడుతూ ఏటా స్వామి వారి వేడుకలను వైభవంగా నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. క్షేత్ర కార్యనిర్వాహకుడు ఏజీ నరేష్ మాట్లాడుతూ జేష్ట శుద్ధ ద్వాదశి రోజైన జూన్ 7న 12వ శ్రీకూర్మ జయంతిని అత్యంత భక్తిశ్రద్ధలతో, వేలాది మంది భక్తుల సమక్షంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు సందడి మహేష్, టి. ప్రతాపరెడ్డి, టీసీ మద్దిలేటి, ధార్మిక సంస్థల ప్రతినిధులు మల్లెల పెద్ద పుల్లారెడ్డి, బిళ్లకంటి మురళి, అభిలాష సురేష్, అంజన్‌బాబు, ఎలమర్తి రమణయ్య, సూర్యశ్రీ, అరుణ, భరద్వాజ శర్మ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

'గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడు'

గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక కల్లూరు, కర్నూలు అధ్యక్షులు పురుషోత్తం, నాగయ్య అన్నారు. ఆదివారం నగరంలోని ఐటీసీ, రాఘవేంద్ర నగర్ ప్రాంతాల్లో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ పుస్తకాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు సుధాకర్, శివ, ఓబులేసు, శేషు, భరత్, గిరి, ప్రియాంక, సునీత, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరండి: టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి

ఓర్వకల్లు, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో 27 నుంచి జరిగే రాష్ట్రస్థాయి టీడీపీ మహానాడు వేడుకలకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గుట్టపాడు సర్పంచ్ నర్ల మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఓర్వకల్లులో ఆయన మాట్లాడుతూ 27 నుంచి 3 రోజుల పాటు కడపలో మహానాడు జరుగుతుందన్నారు. తొలి రోజు పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి, రెండో రోజు ఈ ప్రభుత్వం ఏడాది విజయంపై చర్చా, మూడో రోజు 5 లక్షల మందితో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభలకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సహకారంతో బస్సు ఏర్పాటు చేయడమే కాకుండా ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారన్నారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలను కూడగట్టి భారీగా తరలిరావాలనికోరారు. కార్యక్రమంలో బీసీ సెల్ మండల నాయకులు కురువ అల్లాబాబు, నాయకులు అబ్దుల్లా, ఆదాంబాషా, వేణుగోపాల్ రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.


కర్నూలు టీడీపీ నాయకులతో పరిశీలకులు

కర్నూలు అర్బన్: కడప గడపలో జరిగే మహానాడును చారిత్రకంగా జరుపుకుందామని నాయీబ్రహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ అన్నారు. ఆదివారం జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 29న పది లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించబడుతుందని తెలిపారు. ఈకార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల నుండి ప్రతి నియోజకవర్గం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

● కడపలో జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడును విజయవంతం చేస్తామని కర్నూలు నియోజకవర్గ మహనాడు పరిశీలకులు ఏపీ శాలివాహన సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపది ఈశ్వర్ అన్నారు. ఆదివారం మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో ఆయన నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జీలు, క్లస్టర్ ఇన్‌చార్జీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ ఆలీఖాన్, నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి కమిషనర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ మాట్లాడుతూ సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఐక్యవేదిక నాయకులు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డీఈవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రవికుమార్, ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షులు రంగన్న, ఆప్టా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సేవాలాల్‌నాయక్, మధుసూదన్ రెడ్డి, ఆపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగిరెడ్డి, నాగేశ్వర నాయక్ పాల్గొన్నారు.

మంజులాదేవికి డాక్టరేట్



కర్నూలు హాస్పిటల్, మే 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న మంజులాదేవి ఇంటర్నేషనల్ హ్యూమన్ లైట్స్, అమెరికన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. వైద్యరంగం, సోషల్ సర్వీసు కింద చేసిన సేవలకుగానూ ఆమెకు డాక్టరేట్ ఇచ్చారు. ఆదివారం హైదరాబాదులోని పిస్తా హోటల్‌లో ఇం టర్నేషనల్ హ్యూమన్ లైట్స్ అమెరికన్ యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టరేట్‌ను అందజేశారు. గత 25 సంవత్సరాలు కర్నూలు జీజీహెచ్‌లో స్టాఫ్ నర్సుగా సమాజ సేవ కార్యక్రమాల్లో పాల్గొని సేవా దృక్పథంతో పని చేసేందుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

గ్రంథాలయాలు.. జ్ఞాన భాండాగారాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథాలయ అధికారి పెద్దక్క

కర్నూలు కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచే జ్ఞాన భాండాగారాలు అని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథాలయ అధికారి పెద్దక్క అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో, కేంద్ర పౌర గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు కొనసాగుతున్న 'వేసవి శిక్షణ (అవగాహన) శిబిరాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో వారు శిక్షణ పొందుతున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం శిక్షణల్లో విద్యార్థులకు శిక్షకులు గోపాలకృష్ణ (పుస్తకపఠనం, జనరల్ స్టోరీస్), హాసిని (మెడిటేషన్), మాలిక్ బాషా (చిత్రలేఖనం, పేపర్‌తో బొమ్మల తయారీ) వంటి అంశాల్లో శిక్షణలు ఇచ్చారు.

సీహెచ్‌వోల సమ్మె విరమణ

కర్నూలు హాస్పిటల్, మే 25 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని గత 27 రోజులుగా సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ మేరకు ఆదివారం సమ్మెను విరమించారు. సీహెచ్‌వోల ప్రతినిధులు, మంత్రి, కుటుంబ సంక్షేమ కమిషనర్ వీరపాండియన్ చర్చలు జరిపారు. రాబోయే కాలంలో సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇవ్వడం జరిగింది. దీంతో ఏపీఎంసీపీఏ రాష్ట్ర నాయకులు నిరంజన్, సందీప్, వినోద్‌లు మంత్రి కమిషనర్ సమక్షంలో సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు.

ఘనంగా ముగిసిన క్రెడాయ్ ప్రాపర్టీ ప్రదర్శన


లక్కీడిప్ విజేతకు బహుమతి అందిస్తున్న నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, క్రెడాయ్ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్టీబీసీ క్రీడా మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన క్రెడాయ్ ప్రాపర్టీ ప్రదర్శన ఆదివారం రాత్రి ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి క్రెడాయ్ నిర్వహిస్తున్న ఈప్రదర్శన ఎంతో బాగుందన్నారు. కర్నూలు జిల్లా పరిసర ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేసే ఇలాంటి ప్రదర్శనలకు ప్రభుత్వం కూడా అండగా నిలుస్తుందని చెప్పారు. క్రెడాయ్ ప్రాపర్టీ ప్రదర్శన సందర్భంగా నిర్వహించిన లక్కీ డిప్ విజేతలకు ఆయన బంగారు నాణెం, ఇతర విలువైన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ సంస్థ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్ రెడ్డి, క్రెడాయ్ సంస్థ కన్వీనర్ ఎస్ శ్రీనివాసరావు, క్రెడాయ్ సంస్థ కార్యదర్శి పి. గోవర్ధనరెడ్డి పాల్గొన్నారు.

వ్యాపారుల సమస్యలను పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న విజయ్‌కుమార్ రెడ్డి

కర్నూలు కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): వ్యాపారుల సమస్యలను పరిష్కారానికి ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ కృషి చేస్తుందని జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు ఐ. విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని సంస్థ కార్యాలయంలో 59వ సర్వసభ్య సమావేశం విజయ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు వర్తకులు తెలియజేసిన సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 2025-2028 సంవత్సరాలకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ గౌరవ చైర్మన్‌గా రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, ఆడిటర్‌గా బుచ్చన్న, కోశాధికారిగా తిరిగి కె. మురళీధర్ కల్కూర, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్ నరేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 120 మందికి పైగా సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి టీవీ రత్నప్రసాద్ కోశాధికారి కె.మురళీధర్ కల్కూర, ఓంప్రకాశ్ (కోసిగి), గురుస్వామి (జోన్)లతో పాటు డీవీ రమణ, జగదీష్, మారం అనిల్, జగన్నాథగుప్త, సుబ్రహ్మణ్యం, బదిరీనారాయణ వివిధ ప్రాంతాల సభ్యులు పాల్గొన్నారు.

పీఆర్‌టీ డీఎస్సీ మాక్ టెస్టు కరపత్రం విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు జూన్ 1వ తేదీన నిర్వహిస్తున్న మాక్ టెస్టు కరపత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ చేతుల మీదుగా ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు పీఆర్‌టీయూ కూడా మాక్ టెస్టు నిర్వహించడం అభినందనీయమని, ఈ అవకాశాన్ని డీఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు రవిప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్లు బాబురావు, సుదర్శన్, ఆదినారాయణరెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు మణికుమార్, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరయ్య, శ్రీనివాసులు, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


లొద్దిపల్లెలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఓర్వకల్లు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లొద్దిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మండలంలోని లొద్దిపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. నాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఒకరికొకరు పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. దాదాపు 23 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలవడం జరిగింది. నాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రమోహన్, మురళి మోహన్ రెడ్డి, చంద్రశేఖర్, రాంప్రసాద్ రెడ్డి, కిషోర్, చిన్న మల్లయ్య, పుల్లయ్య, బ్రహ్మయ్య, మాధవస్వామి, యోగేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కోల్స్ మెమోరియల్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 30 ఏళ్ల తర్వాత 1993-95 బ్యాచ్ సీఈసీ గ్రూపు విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని ఒకరికొకరు యోగా క్షేమాలు తెలుపుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన నాటి గురువులకు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అప్పటి ఇంగ్లీషు లెక్చరర్ ప్రభాకర్ రావు, ఎకనామిక్స్ అధ్యాపకులు మోజెస్, ప్రస్తుత కాలేజీ ప్రిన్సిపాల్ నేహెమియాలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి రవి, చాంద్‌బాషా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సునీత, అగ్రికల్చర్ ఆలూరు మార్కెట్ యార్డు సెక్రటరీ రజిత, పూర్వ విద్యార్థులు డీఆర్‌డీఏ ఏపీఎం ఎంబీ వెంకటస్వామి, పత్తికొండ డ్వామా ఏపీడీ సురేష్ పాల్గొన్నారు.

గిరిజనుల ఉత్పత్తులను అన్ని జిల్లాలకు విస్తరింపజేయాలి


వినతి పత్రం ఇస్తున్న గిరిజన సంఘాల నాయకులు

కర్నూలు కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజనులు తయారు చేసిన ఉత్పత్తులను గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ద్వారా అన్ని జిల్లాలకు విస్తరింపజేయాలని ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు కోరారు. ఆదివారం గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌ను స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ఎరుకుల రాజు, బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణ నాయక్, జీసీసీ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.అరుణ్ నాయక్ కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అరకు కాఫీ ఉత్పత్తులను అన్ని జిల్లాలోని అన్ని మార్కెట్‌లలో, ప్రతి రైతుబజార్లలో అమ్ముకునేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా చైర్మన్ బద్దు నాయక్, ఫ్యాప్టో చైర్మన్ సేవాలాల్ నాయక్, ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ నాయక్, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాము నాయక్, ఎరుకుల హరి, చంద్ర నాయక్ పాల్గొన్నారు.

కేతవరం-పూడిచెర్ల రోడ్డు పనులు ప్రారంభించాలి


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు రామకృష్ణ

ఓర్వకల్లు, మే 25 (ఆంధ్రజ్యోతి): కేతవరం నుంచి పూడిచర్ల వరకు రోడ్డు పనులు ప్రారంభించకపోతే జాతీయ రహదారి పూడిచర్ల మెట్ట వద్ద నిర్బంధిస్తామని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 27లోపు కేతవరం నుంచి గార్లేయాపురం, అక్కడి నుంచి కేతవరం, పూడిచెర్ల మెట్ట వరకు రోడ్డు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, శ్రీధర్, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, చంద్రబాబు నాయుడు, మధుసూదన్, సుధాకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అకలేషియా కార్డియోకు ఫోయెమ్ ప్రక్రియ

● ఒకేసారి ఆరు మందికి డా.మోహన్ రాంచందాని చికిత్స


డా.మోహన్ రాంచందానిని సన్మానిస్తున్న గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు

కర్నూలు హాస్పిటల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మింగుటలో ఇబ్బంది పడుతున్న ఆరు మంది రోగులకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగంలో హైదరాబాదు ఏఐజీకి చెందిన ప్రభుత్వ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.మోహన్ రామచందాని పోయెమ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. కండరాల సమస్యల వల్ల వచ్చే మింగుట రుగ్మతలకు పోయెమ్ ఎండోస్కోపి ద్వారా ఈ విధానాన్ని డా.మోహన్ రాంచందాని చేశారు. ఇందులో గత కొద్ది రోజులుగా మింగుటలో ఇబ్బంది పడుతున్న గద్వాల జిల్లాకు చెందిన 60 ఏళ్ల వృద్ధుడికి కూడా ఎండోస్కోపిక్ పద్ధతులను ఉపయోగించి చికిత్స చేశారు. అలాగే అక్లేషియా కార్డియోతో ఇబ్బంది పడుతున్న మరో ఐదు మందికి కూడా పోయెమ్ చికిత్స అందించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డా.జి.మోహన్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జీజీహెచ్‌లో ఇప్పటి వరకు 14 మంది ఎండోస్కోపిక్ ద్వారా పోయెమ్ ప్రొసిజర్స్ నిర్వహించామన్నారు. అక్లేషియా కార్డియో అనేది కండరం తెరుచుకోవడం, మూసివేయడం వంటి సమస్య అని దిగువ అన్నవాహిక, గ్యాస్ట్రిక్ రసాలు అన్నవాహికలోనికి కణజాలం దెబ్బతినకుండా నిరోధించడానికి తిన్నప్పుడు కండరం గట్టిగా మూసివేయబడుతుందన్నారు. పోయెమ్ ప్రక్రియలో శరీరంలో మరెక్కడా కొత లేకుండా ఉంటుందని, రోగులు ఎక్కువ కాలం ఆసుపత్రిలో ఉండకూండా ప్రక్రియ అయిన తర్వాత ఇంటికి వెళ్లవచ్చునన్నారు కార్యక్రమంలో సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ, కర్నూలు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు డా.ప్రవీణ్ కుమార్, డా.అర్షియా, డా.దీపక్, పీజీలు పాల్గొన్నారు.



మండలంలోని మార్లమాడికి నుంచి వేదవతి మీదుగా వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రహదారిలోనే నిత్యం వందల వాహనాలు కర్ణాటకకు వెళుతుంటాయి. ముందు వేదవతి నది వంతెన రోడ్డు కూడా సరిగా లేదు. నూతన రహదారి వేయాలని వాహనదారులు కోరుతున్నారు. - హొళగుంద



ఆలూరు పట్టణంలోని అంబేడ్కర్ భవన్ పక్కన మురుగు నిల్వ ఉంది. దోమలు వ్యాప్తి చెంది దుర్వాసన వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోయనగర్ కాలనీ మురుగును జాతీయ రహదారి పక్కనే ఉన్న కాలువలోకి మళ్లించాల్సి ఉంది. అయితే కొందరు అభ్యంతరం తెలుపుతుండడంతో పంచాయతీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. - ఆలూరు

కరోనా విషయంలో జాగ్రత్తలు పాటించండి



వైద్యాధికారి హరిత

తుగ్గలి, మే 25 (ఆంధ్రజ్యోతి): కరోనా కొత్త వేరియంట్ కేసులు నమోదవుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పగిడిరాయి వైద్యాధికారి హరిత సూచించారు. 60 ఏళ్ల పైబడ్డ వృద్ధులు, చిన్నపిల్లలు దూర ప్రాంత ప్రయాణాలు చేయవద్దన్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకుండా, సామాజిక దూరాన్ని పాటించాలని, ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మహానాడును విజయవంతం చేయాలి



కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తున్న వీరభద్రగౌడ్

ఆలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న కడపలో నిర్వహిచనున్న టీడీపీ మహానాడును విజయవంతం చేయాలని ఆ పార్టీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం కార్యాలయంలో మహానాడుకు వాహనాల ఏర్పాటుపై గ్రామాలవారీగా సమీక్షించి ఏర్పాటు చేశారు. నియోజకవర్గం నుంచి దాదాపుగా 300 వాహనాలను ఏర్పాటు చేసి వాహనానికి ఒక ఇన్‌చార్జి చొప్పున నియమించామన్నారు. నాయ కులు గిరి మల్లేష్‌గౌడ్, వన్నూరువలి, రాముయాదవ్, అంజిరెడ్డి, దద్దు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతో మరుగుదొడ్లు : ఎమ్మెల్యే



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో మహిళలకు వ్యక్తిగత మరుగు దొడ్ల మంజూరుకు అనుమతి లభించిందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదివారం శివారు ప్రాంతం అమరావతి నగర్‌లో పర్యటించి, స్థానికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని 42 వార్డుల్లో అభివృద్ధి పనులు చేసేందుకు కృషి చేస్తున్నానని, తనకు సహకరించాల న్నారు. పేదల కుటుంబానికి 2 సెంట్ల చొప్పున స్థలంతో పాటు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం వంద కుటుంబాలవారు బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వార్డు ప్రజలతో కలిసి టీవీలో మన్-కీ-బాత్‌లో ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ, వెల్లాల మధుసూదన్ శర్మ, మాజీ కౌన్సిలర్ సింహం నాగేంద్ర, నాయకులు నాగరాజ్ గౌడ్, ఉపేంద్ర కుమార్, మహబూబ్ బాషా, పూల రఘు, ఉషారాణి, నూర్జహాన్, పరశురాం ఉన్నారు.

ఎయిడ్స్ అంటువ్యాధి కాదు

మద్దికెర, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, జాగ్రత్తలు పాటించాలని కళాకారులు పేర్కొన్నారు. ఆదివారం మద్దికెర మెయిన్ బజారులో కళాజాత నిర్వహించారు. ఎయిడ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బాధితులకు ప్రభుత్వం అన్ని సహకారాలు అందిస్తుందన్నారు. హ్యాండ్స్ సంస్థ సిబ్బంది నీలావతి, వైష్ణవి, కళ్యాణి, నీలమ్మ, ఆనంద్, మస్తాన్‌బీ తదితరులు ఉన్నారు.

సీఎస్ఐ క్రైస్ట్ చర్చి కమిటీ ఎన్నిక



విక్టోరియపేట సీఎస్ఐ క్రైస్ట్ చర్చి సభ్యులు

ఆదోని అగ్రికల్చర్, మే 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్టోరియపేట సీఎస్ఐ క్రైస్ట్ చర్చి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికల సంఘం అధికారులుగా సీఎస్ఐ డివిజనల్ ఛైర్మన్ రెవరెండ్ పాస్టర్ చినబాబు, స్థానిక సంఘ కాపరి రెవరెండ్ పాస్టర్ విలియం సుజిత్ మనోహర్‌బాబు వ్యవహరించారు. 2025-28 కమిటీకి ఎన్నికలు జరిగాయి. సంఘ కార్యదర్శిగా ఎస్‌జే సునీల్ రాజ్‌కుమార్, శ్రీకాంత్, జోనాథన్, అమృత్ కుమార్, శైలజ ప్రేమ కుమారి, సునీత రాజు, సౌజన్య కుమారి, గాయత్రి, అనూష, పద్మ గెలుపొందినట్లు ఎన్నికల ఫలితాలు ప్రకటించారు.

చౌక దుకాణాల్లో రేషన్



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న అధికారులు

దేవనకొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): కార్డుదరులకు జూన్ 1 నుంచి చౌక దుకాణాల్లోనే రేషన్ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ప్రసాదురాజు తెలిపారు. ఆదివారం కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీలర్లు చౌకదుకాణాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, రేషన్ సక్రమంగా పంపిణీ చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతినెల 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ అందుబాటులో ఉంటుందని కార్డుదారులు 15వ తేదీలోపు ఎప్పుడైనా రేషన్ తీసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ లక్కిరెడ్డి విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బజరంగ్‌దళ్‌కు అభినందనలు

ఆదోని టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): బజరంగ్ దళ్ శౌర్య ప్రశిక్షణకు ఎంపికైన 28 మందిని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన గౌడ్, ఉపాధ్యక్షుడు భీమిరెడ్డి అభినందించారు. అనంతపురంలో ఏడు రోజులు పాటు జరిగే శిక్షణను దిగ్విజయంగా పూర్తి చేసుకొని స్థానికులకు కూడా వివరిస్తూ తర్ఫీదును ఇవ్వాలని సూచించారు. జిల్లా కార్యదర్శి హనుమంత రెడ్డి, కోశాధికారి కొంగే పంపాపతి, సభ్యులను అభినందించారు.

తొలకరితో రైతు పులకింత

● పత్తి, వేరుశనగ విత్తుతున్న రైతులు ● జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు



దేవనకొండలో విత్తనం వేస్తున్న కూలీలు

దేవనకొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): తొలకరి వర్షాలు మొదలు కావడంతో రైతులు పులకించిపోయారు. మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో పత్తి, వేరుశనగ విత్తనాలు విత్తుతున్నారు. ఇప్పటికే పొలాలను దుక్కి, దున్ని పంట వేసేందుకు సిద్ధం చేశారు. పది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రోహిణి కార్తెలోనే వాతావరణం చల్లబడటంతో విత్తనాలు వేస్తున్నట్లు రైతులు తెలిపారు.

జోరుగా పత్తి విత్తనాలు..

ఆస్పరి: మండలంలో ఎర్రనేల పొలాలు అధికంగా ఉన్న యాటకల్లు, కైరవాల, తంగరడోణ, తురువగల్లు, బైలుపత్తికొండ, కలపరి, బిల్లేకల్, వలగొండ, ములుగుందం, కారుమంచి, డి.కోటకొండ గ్రామాల్లో పత్తి విత్తనాలు వేస్తున్నారు. మండలంలో సాధారణ పత్తి సాగు విస్తీర్ణం 15 ఎకరాల వరకు ఉంది.

ఆశతో పత్తి విత్తాం

ఈనెలలో విత్తితే అధిక దిగుబడి వస్తుందన్న నమ్మకంతో పత్తి విత్తనం వేస్తున్నాంజ 16 ఎకరాల్లో పత్తి సాగు చేయడానికి భూమిని చదును చేశాను. ప్రస్తుతం 8 ఎకరాల్లో విత్తనం వేశాను. **- చాకలి ఈరన్న, రైతు, కైరుప్పల**

తేమ శాతాన్ని బట్టి విత్తనం వేయాలి

నేలలో 30 నుంచి 60 శాతం వరకు తేమ ఉన్నట్లయితే విత్తనం నాటుకోవాలి. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో డీలరు వద్ద నుంచి రసీదు తీసుకోవాలి. నాణ్యమైనవే కొనాలి. సలహాలు, సూచనల కోసం వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించండి. **- నరేంద్రకుమార్, ఏవో, ఆస్పరి**

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర, అరికేర తండా, కరణి గూడ్డం, ముద్దనగేరి, హులేబీడు, అగ్రహారం, తుంబలబీడు, పెద్దహోత్తూరు గ్రామాల్లో రైతులు పత్తి, కంది, ఆముదం, విత్తనాలు విత్తుతున్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆశిస్తున్నారు.



అరికెరలో కంది విత్తనం వేస్తున్న రైతులు

జూన్ నుంచి రేషన్ షాప్‌లోనే సరుకులు

● వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు హోమ్ డెలివరీ: సబ్ కలెక్టర్ మౌర్య భరధ్వాజ్



ఆదోని, మే 25 (ఆంధ్రజ్యోతి): జూన్ ఒకటో తేదీ నుంచి లబ్ధిదారులకు చౌకధర దుకాణాల్లో పంపిణీ చేయనున్నట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. ఆదివారం మాట్లాడుతూ 65ఏళ్ల పైబడిన వారికి, విభిన్న ప్రతిభావంతులకు హోమ్ డెలివరీ చేస్తామన్నారు. చౌక దుకాణాలు ఉదయం 8:00 గంటల నుంచి 12:00 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8గంటల వరకు దుకాణాలు ఉంటాయని ప్రజలు సరుకులు తీసుకోవాలన్నారు.

కేజీబీవీలో సీట్లు ఫుల్

● సీటు కోసం, పాఠశాల సిబ్బంది, నాయకుల చుట్టూ తల్లిదండ్రుల ప్రదక్షిణలు



మద్దికెర కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం

మద్దికెర, మే 25 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సీట్లు ఫుల్ అయ్యాయి. ప్రభుత్వం కార్పొరేట్‌కు ధీటుగా సౌకర్యాలు కల్పిస్తుండటంతో చేరేందుకు విద్యార్థులు క్యూ కడుతున్నారు. ఎస్‌వో జ్యోతిరెడ్డి మాట్లాడుతూ 6వ తరగతిలో 40 సీట్లు ఉండగా. మొదటి విడతలో 27, రెండో విడతలో 13 సీట్లను భర్తీ చేశామన్నారు. తమ పిల్లలను చేర్పించాలని ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్లు చేయిస్తున్నారు.

ఆస్పరి: ఆరో తరగతిలో 40, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు భర్తీ అయ్యాయని ఎస్‌వో స్టైలీ తెలిపారు.

10 ఇంటర్మీడియట్ సీట్లు ఖాళీ

తుగ్గలి: కస్తూర్బా పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు అడ్మిషన్లు పూర్తయ్యాయని ఎస్‌వో షాహీన్ తెలిపారు. అయితే ఇంటర్ మొదటి సంవత్సరానికి 10 సీట్లు ఖాళీగా ఉన్నాయనీ, ఆన్‌లైన్‌లోలో దరఖాస్తు చేసుకుని, సంప్రదించాలని కోరారు.

ఉపాధి కూలీలకు బీమా

● అంగవైకల్యం సంభవించినా, మరణించినా పరిహారం వర్తింపు



కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆలూరు, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలో 10 వేలకు పైగా ఉపాధి కూలీలు ఉన్నారు. కూలీలు పనిచేస్తుండగా మరణించినా, అంగవైకల్యానికి గురైనా ప్రభుత్వం బీమా వర్తింపజేస్తుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు మేలు చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన వర్తించేలా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. ఏటా జూన్ 1 నుంచి మే 31వ తేదీ వరకు బీమాను అమలు చేస్తున్నారు.

పథకం వివరాలు..

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనకు ఉపాధి కూలీలు 18-70 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అర్హులు. ఉపాధి కూలీల బ్యాంకు ఖాతా నుంచి ఏడాదికి కేవలం రూ.20లు జమ అవుతుంది. అంగవైకల్యానికి రూ.లక్ష, మృతిచెందితే రూ.2లక్షలు పరిహారం అందుతుంది. అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యో జనకు 18-50 యేళ్ల వారు అర్హులు. ఏడాదికి రూ.436లు ప్రీమియం చెల్లించాలి. అంగవైకల్యానికి రూ.2లక్షలు, మృ తిచెందితే రూ.5 లక్షలు ఇస్తారు. ప్రక్రియ అంతా బ్యాంకులు, తపాల కార్యాల యాలు, బీసీ పాయింట్లలో మేలోనే పూర్తి చేసి జూన్ 1 నుంచి వర్తింప జేయనున్నారు.

కూలీలకు బీమా అవసరం



ఉపాధి కూలీలకు బీమా అవసరం. అంగవైకల్యానికి గురైనా, మృతిచెందినా పరిహారం అందుతుంది. ప్రీమియంను నేరుగా ఖాతా నుంచే జమ చేస్తారు. **- శ్రీనివాసులు, ఏపీవో, ఆలూరు**

స్కూల్ అసిస్టెంట్లను హెచ్‌ఎంలుగా నియమించొద్దు

ఆదోని అగ్రికల్చర్, మే 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా నియమించొద్దని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సి.నాగరాజు, పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ హేతుబద్ధీకరణలో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా నియమించడం వల్ల సీనియర్ ఎస్జీటీలకు అన్యాయం జరుగుతుందన్నారు. పట్టణ అధ్యక్షుడు రవి, పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు నాయకులు జంబులయ్య రాజ్, సతీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ సహాధ్యక్షుడు నాగరాజు

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు బాండ్ అందజేస్తున్న మిత్రులు

దేవనకొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెర్నేకల్ గ్రామంలో మృతిచెందిన స్నేహితుడు ఉమాపతి కుటుంబానికి 2008 పదో తరగతి మిత్రులు రూ.50 వేల ఆర్థిక సాయం చేశారు. రెండు నెలల కిందట మృతిచెందడంతో, కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.50వేలను బ్యాంకులో డిపాజిట్ చేసి ఉమాపతి భార్య, పిల్లలకు అందించారు. మిత్రులు బాటమీది మధు, చిట్టిబాబు, నాగన్న, కె.మధు, కృష్ణ ఉన్నారు..

స్నేహితుడి వైద్యానికి ఆర్థిక సాయం

పత్తికొండ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి వైద్య చికిత్సకు పూర్వ విద్యార్థులు రూ.లక్ష అందజేశారు. పట్టణానికి చెందిన గోవిందరాజులు కొద్ది రోజుల క్రితం మెదడు సంబంధ వ్యాధితో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించగా, శస్త్ర చికిత్స చేయాలని రూ.15లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పూర్వ పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల 1984-86లో బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు రూ.లక్ష ఫోన్‌పే పంపారు. దీంతో గోవిందరాజులు వీరికి కృతజ్ఞతలు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఆదోని అగ్రికల్చర్, మే 25(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా కోర్టు నామినేటెడ్ మెంబర్, న్యాయవాది లోకేశ్ కుమార్ అన్నారు. ఆదివారం చిన్మయ్య ఆధ్యాత్మిక కేంద్రంలో జిల్లా న్యాయాధికారి ఆదేశాల మేరకు చైల్డ్ మిస్సింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు చదువు విలువనిస్తుందని సూచించారు. చదువుతో పాటు ఆటలు, కరాటే, యోగా నేర్చుకోవాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. న్యాయవాది సావిత్రి, వీరన్న, వీర రాయల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది లోకేశ్

నేటి నుంచి యోగా పోటీలు

తుగ్గలి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో నేటి నుంచి యోగాసనాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విశ్వ మోహన్ ఆదివారం తెలిపారు. అన్ని వయస్సుల వారికి వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని 30వ తేదీ వరకు గ్రామస్థాయిలో, జూన్ 2 నుంచి 7 వరకు మండల స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి యోగా శిక్షణ

పత్తికొండ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నుంచి ఉచిత యోగా శిక్షణ ప్రారంభిస్తున్నట్లు విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్, యోగా మాస్టర్ బీటీసీ రంగస్వామి తెలిపారు. మానసిక ఒత్తిడి నుంచి బయట పడేందుకు యోగా, ప్రాణాయామం ఉపయోగపడతా యన్నారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే చర్యలు

తుగ్గలి, మే 25 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్ పాటించిన వాహనదారులపై చర్యలు తప్పవని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. ఆదివారం జొన్నగిరి గ్రామ శివారులో చెరువు కట్ట వద్ద వాహనాలు తనిఖీ చేసి. అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలన్నారు.

పండ్లు, పూల సాగుకు దరఖాస్తు చేసుకోవాలి

మద్దికెర, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం ద్వారా వంద శాతం రాయితీతో పండ్ల తోటలు, పూల మొక్కలు సాగుకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో నర్సిరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. మామిడి, జామ, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, నేరేడు, సపోట, కొబ్బరి, చింత, డ్రాగన్ ఫ్రూట్, అంజూర, మునగ, మల్లె, రోజా తదితర పండ్ల, పూలమొక్కల సాగుకు అవకాశం ఉందన్నారు. జాబ్‌కార్డు, ఐదెకరాల్లోపు పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులన్నారు. భూ సార పరీక్షల కార్డు, 1బీ అడంగల్, సన్న, చిన్నకారు రైతు సర్టిఫికెట్లతో ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి



మాట్లాడుతున్న 4వ వార్డు కాలనీవాసులు

వెల్దుర్తి, మే 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం 4వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు రాజేశ్, సునీలు, రాజు, రాములు డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ వెల్దుర్తికి వచ్చిన డీఎల్‌పీవో లక్ష్మి, ఈవోఆర్డీ, పంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లామ న్నారు. రెండు నెలల క్రితం స్పందనలో అర్జీ ఇచ్చామని అయినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీ పక్కనే ఉన్న బీసీ కాలనీకి రెండు రోజులకోసారి నీరు వస్తోందని, అయితే దళితులు నివాసమున్న 4వ వార్డులో పదిరోజులకోసారి నీరు వదులుతున్నారని, తిగునీరు అందక ఇబ్బంది పడుతున్నామని, ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

వేగవంతంగా విభిన్నప్రతిభావంతుల సర్వే

మద్దికెర, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతుల సర్వేను వేగవంతం చేసినట్లు ఎంఈవో రంగస్వామి తెలిపారు. ఆదివారం ఉపాధ్యాయ మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో సర్వే చేశారు. 0 నుంచి 18 సంవత్సరాల వరకు విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించి వారికి నాణ్యమైన విద్య, పరికరాలు, వినికిడి యంత్రాలు, ట్రైసైకిల్స్ ప్రభుత్వం అందిస్తుందన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

● వెల్దుర్తి, ఆలూరు పాఠశాలల్లో కలుసుకున్న స్నేహితులు



వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి పాఠశాల పూర్వ విద్యార్థులు



ఆలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనగిరి జడ్పీహెచ్ పాఠశాల 1996-2001 పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సంతోషంగా గడిపారు. తాము చేసిన అల్లర్లను స్నేహితులతో పంచుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు అన్వర్‌బాషా, ప్రభుచరణ్, శ్రీనివాసరెడ్డి, రమాదేవి, శ్రీనివాసకుమార్, ఎండీ కృష్ణయ్య, పీఈటీ మెహబూబ్ బాషా, కృష్ణమూర్తి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను తమను గుర్తుపెట్టుకోవడంతో సంతోషంగా ఉందన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ఆలూరు, మే 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1లో 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 23 యేళ్ల తర్వాత తమ స్నేహితులను చూసి ఆనందాన్ని పంచుకున్నారు. ఆట, పాటలతో సందడి చేసి అందరూ తీపి గుర్తుగా గ్రూప్ ఫొటో తీసుకున్నారు.

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

సాగుకు సిద్ధమైన అన్నదాత

● ఎమ్మిగనూరు డివిజన్‌లో 69,172 హెక్టార్లలో సాగుకు సిద్ధం

● ఇప్పటి దాకా10వేల హెక్టార్లలో సాగు

గోనెగండ్ల, మే 25(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ముందస్తు వానలు కురియడంతో రైతన్నలు వానాకాలం సీజన్ పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. తొలకరి వర్షాలు కురియడం ముందస్తు రుతుపవనాల రాక ఈ సీజన్‌లో సాగుకు అనుకూలంగా మారింది. రోహిణి కార్తెలో పంటసాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని రైతుల నమ్మకం. ఆదివారం రోహిణి కార్తె ప్రారంభం కావడంతో రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే పత్తి, వేరుశనగ, మిరప, ఉల్లి, పంటలతో పాటు ఆరుతడి పంటలను విత్తుకోవడం ప్రారంభించారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో రైతులు పొలం దుక్కిదున్ని విత్తనం వేసేందుకు తమ పొలాలను సిద్ధం చేసుకున్నారు. బావులు బోర్ల దగ్గర మాత్రం ఇప్పటికే పత్తి, మిరప, వేరుశనగ పంటలను సాగు చేశారు. ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం మండలాలలో ఈ వర్షాకాలం సీజన్‌లో 69172 హెక్టార్లు సాగు కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు దాదాపు 10వేల హెక్టర్లలో సాగు అయినట్లు తెలుస్తోంది. ఇక పత్తి సాగుపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దాదాపు 30వేల హెక్టర్లలో పత్తి సాగు చేయవచ్చని అధికారులు తెలుపుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో రైతులు పొలాలను దుక్కిదున్ని సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. చాలా



పొలంలో విత్తనాలు విత్తుతున్న దృశ్యం



పొలాన్ని దున్నుతున్న రైతు

మంది రైతులు ముందస్తుగా బావులు, బోర్ల దగ్గర పత్తి పంటను సాగుచేశారు. ఇప్పటికే మండలంలో గోనెగండ్ల, కు లుమాల, అలువాల, చిన్నమరివీడు, వేముగోడు, తిప్పనూరు, బైలుప్పల, గంజహళ్లి, అగ్రహారం, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, నందవరం మండలంలో ముగతి, నాగలదిన్నె, నందవరం, మిట్టసోమాపురం, గంగవరం, చిన్నకొత్తిలి, పెద్దకొత్తిలి, హలహర్వి, మచాపురం, పులచింత, ఎమ్మిగనూరు, గ్రామాల్లో పత్తి పంటను ఆధికంగా సాగుచేస్తున్నారు.

ఈ సారి ముందుగానే రుతుపవనాలు

ఖరీఫ్ సాగులో నైరుతి రుతుపవనాలు కీలకమైన పాత్రపోషిస్తాయి. ఈ ఏడాది రైతులు వర్షాలు సమృద్ధిగా పడాలని కోరుకుంటున్నారు. నిర్ణీత సమయం కంటే ముందే ఈ సారి నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతవరణ శాఖ (ఐఎండీ) ఇటీవల ప్రకటించింది. జూన్ మొదటి వారంలోనే రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకుతాయని శాస్త్రవేత్తలు అంచనాలు వేస్తున్నారు. వానలు పడేందుకు మరో వారం రోజలు ఉండటంతో రైతులు సాగుకు సిద్దమవుతున్నారు.

భూసార పరీక్షల పై ప్రత్యేక దృష్టి

రైతులు భూసార పరీక్షలు చేపించుకుని ఏ పం టలు సాగుచేయాలి ఎంత మోతాదులో ఎరువులు వాడాలో తెలుకునేందుకు అధికారులు రైతులకు అవ గాహన కల్పిస్తున్నారు. అలాగే ఏఏ పంటలు సాగు చేసుకుంటే మంచిదో ఎంత దిగుబడి వస్తుందో తెలి యజేసేందుకుగాను ఎరువాక, వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

విత్తనాల సాగు తీసుకోవలసిన జాగ్రత్తలు

విత్తనాల ఎంపికలో రైతులు చాల జాగ్రత్తలు తీసు కోవాలి. స్థానిక ఏవో, ఏడీఏ, ఇతర వ్యవసాయ అధికారులను సంప్రదించి విత్తనాల విషయంలో అవసరమైన సలహాలు తీసుకోవాలి. సిద్ధం చేసుకున్న దుక్కిలో పచ్చిరోట్టె విత్తనాలు తప్పనిసరిగా నాటితే మేలు. ఎరువుల దుకాణంలో ఏదికొన్నా రశీదు తీసుకొని భద్రపరుచుకోవాలి. వాతావరణ మార్పులు, సాగునీటి అవసరాలకు అనుగుణంగా పంటల సాగు మార్పు చేసుకుంటే అధికలాభాలు సాధించవచ్చు.



బోర్ల దగ్గర ముందస్తుగా సాగు చేసిన వేరుశనగ

ఎస్ ఎస్ ట్యాంకుకు ముళ్లకంపల గండం



చెరువు గట్టుపై పెరిగిన ముళ్ల చెట్లు

కౌతాళం, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజానగర్ క్యాంపు వద్ద నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు గట్టుపై ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో ట్యాంకు చుట్టూ మరమ్మతుల కోసం ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిధులు కేటాయిస్తున్నా నిర్వహకులు మాత్రం చెరువు గట్టుపై పిచ్చి మొక్కలు, ముళ్ళ చెట్లు పెరిగినా వాటిని తొలగించక పోవడంతో గట్టు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. చెరువు గండిపడితే ఈ ట్యాంకు నుంచి తాగునీరు సరఫరా అయ్యే గ్రామాలకు తీవ్రమైన నీటి ఎద్దడి తప్పదు. ముఖ్యంగా కౌతాళంలో దాదాపు 20 వేల జనాభా నీటి అవసరాలకు ఈ చెరువే ఆధారం ఇప్పటికైన సంబంధిత అధికారులు చెరువు గట్టుపై పెరిగిన పిచ్చి మొక్కలను, ముళ్ళ చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ఎమ్మిగనూరు - కోసిగి రహదారిపై నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు నుంచి కొసిగి వెళ్ళే ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో స్థానిక ప్రజలు, వాహనదారులతో కలిసి సీపీఐ (ఎంఎల్)నాయకులు రాస్తారోకొ నిర్వహించారు. రహదారి అధ్వానంగా తయారైందని తక్షణమే ఆర్ అండ్ బీ అధికారులు కొసిగి ప్రధాన రహదారికి నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఐ (ఎంఎల్)న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు సత్యన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారిపై గ్రామాల నుంచి నిత్యం కూరగాయలతో వాహనాలు ఎమ్మిగనూరులోని మార్కెట్ యార్డుకు చేరుస్తుంటారు. రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణం నరకయాతన తలపిస్తోందన్నారు 108 వాహనంలో గర్భిణి స్త్రీ రావడానికి 2గంటలు పడితే ఆసుపత్రి చేరే వరకు తన ప్రాణానికి గ్యారంటి లేదని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్)న్యూడెమొక్రసీ నాయకులు బాలరాజు, బాబు, పాల్గొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

పెద్దకడుబూరు, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 6వతరగతి ప్రవేశానికి డీఈవో కార్యాలయం నుంచి మెరిట్ జాబితా విడుదల అయినట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రంగన్న తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 21న ఆరవ తరగతి ప్రవేశానికి పరీక్ష నిర్వహించామన్నారు. పాఠశాలలో 100 సీట్లుకు గాను 265మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హజరయ్యారన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులు ఆధారంగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి సెలెక్షన్ లిస్ట్ విడుదల చేసిందన్నారు. సెలెక్షన్ లిస్టను పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. విద్యార్థులు ,తల్లిదండ్రులు గమనించి 6వతరగతి ప్రవేశానికి అవసరమయ్యే ధృవ పత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు.

అండగా ఉంటాం

మంత్రాలయం, మే 25 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని రాఘసుధ లాడ్జి యజమాని, సీనియర్ నాయకుడు అశోక్ వర్మ మృతి బాధాకరమని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని వైసీపీ నాయకులు అన్నారు. ఆదివారం మంత్రాలయం సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు, వైసీపీ జిల్లా ఉపాధక్షులు ప్రదీప్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ గుర్రెడ్డి భీమిరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అశోక్ వర్మ మృతదేహనికి నివాళి అర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ సలహమండలి మాజీ స భ్యులు మల్లికార్జున, రవిరెడ్డి, శివ, గ్లోబుల్ పాఠశాల ప్రిన్సిపాల్ రాఘ వేంద్ర, వైష్ణవి పాఠశాల హెచ్‌ఎం అశ్విని, నారాయణ ఉన్నారు.

శిలాఫలకం ధ్వంసం

పెద్దకడుబూరు, మే 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముచ్చిగిరి గ్రామంలో ఓహెచ్‌ఆర్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసంచేశారు. గత ప్రభుత్వ హయాంలో జలజీవన్ మిషన్ కింద ఓహెచ్‌ఆర్ ట్యాంకు ప్రారంభించారు. ఆ సమయంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేయగా శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వసం చేయడంతో స్థానికులు ఘటనపై మండి పడుతున్నారు.

29 నుంచి వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్రలు

ఎమ్మిగనూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వికసిత్ సంకల్ప అభియాన్ యాత్రలను మే 29 నుంచి జూన్ 12వరకు నిర్వహిస్తున్నట్లు మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ యాత్రను 700పైగా జిల్లాల్లో దేశవ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. ఈ యాత్రలో రైతులు, శాస్త్రవేత్తలు- రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు ఉంటాయన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ప్రతి రోజు మూడు గ్రామాలను సందర్శించి రైతులతో మాటాడతామని, వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, నూతన వ్యవసాయ యాంత్రికీకరణ గురించి అవగాహన కల్పిస్తామన్నారు. వ్యవసాయ డ్రోన్ల ప్రదర్శన, పంటల వైవిధ్యత, వ్యవసాయ పథకాలు భూసార పరీక్ష పత్రాల వినియోగంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామని, ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

టౌన్‌బ్యాంకు ఎన్నికలకు సిద్ధం



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు

ఎమ్మిగనూరు, మే 25(ఆంధ్రజ్యోతి): టౌన్‌బ్యాంకు ఎన్నికలు ఎప్పుడు వచ్చిన వద్దనలేదని, రాజ్యాంగ బద్దంగా ఎన్నిలు ఎప్పుడు జరిగినా పోటీకి సిద్దమేనని టౌన్‌బ్యాంకు చైర్మన్, వైస్‌చైర్మన్ ఉరుకుందయ్య శెట్టి, బండా నరసప్పలు అన్నారు. ఆదివారం టౌన్‌బ్యాంకులో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బ్యాంకు చైర్మన్ ఉరుకుందయ్య శెట్టిని వయో వృద్దుడని హేళన చేయటం సరికాదన్నారు. బ్యాంకు రుణాల విషయంలో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారనే తరుణంలో లీగల్ ఒపీనియన్ కొరకు న్యాయసలహాలు తీసుకున్నామని, ఇప్పటి వరకు బ్యాంకుకు న్యాయసలహాదారులు లేరన్న విషయాన్ని వైసీపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హాయంలో బ్యాంకు మాజీ చైర్మన్ కొమ్ము రాజశేఖర్ బినామి పేర్లతో రుణాలు తీసుకున్నారని, బ్యాంకు ఉద్యోగులను వాడుకొని బ్యాంకు ధనాన్ని ఎటువంటి సంతకాలు లేకుండా తీసుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని తాము ముందుగానే పసిగట్టినట్లు తెలుసుకొని వైసీపీ నాయకులు, మాజీ చైర్మన్ ఎక్కడ తమబండారం బయటపడుతుందోనని తమపై బురుద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు ఉప్పర రవి, గిరి, షాలేమ్, దోమా భీమేష్, మహెతక్ భాషలు పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణ పల్లకీ ఉత్సవం



స్వర్ణ పల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్ర స్వామి

మంత్రాలయం, మే 25 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం రమణీయంగా నిర్వహించారు. మఠంలో ఆదివారం వైశాఖ త్రయోదశి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధీష్ఠించి రమణీయంగా ఊరేగించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు మంగళవాయిద్యాల మధ్య స్వామివారు శ్రీమఠం ప్రాంగణం చుట్టూ ఊరేగుతున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఊంజలసేవ చేశారు. బృందావనాన్ని బంగారు, వెండి,పట్టు వస్త్రాలు, గులాబి పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు.

● **మంచాలమ్మకు విశేష పుష్పాభిషేకం**

పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి, గ్రామదేవత మంచాలమ్మకు సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు, వెండి కవచాలతో చూడ ముచ్చటగా అలంకరించారు. దేవతమూర్తుల అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

● **ధార్మిక పర్యటనకు పీఠాధిపతి**

పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటనలో భాగంగా మంత్రాలయంలో పూజలు ముగించుకున్న అనంతరం ఆదివారం సాయంత్రం తన శిష్యబృందంతో కలసి బెంగళూరుకు బయలు దేరి వెళ్లారు. మూడురోజుల పాటు బెంగళూరు, కర్నాటక లోని వివిధ పట్టణాల్లో పూజలుచేసి అక్కడి భక్తులను ఆశీర్వాదించనున్నారు. ధార్మిక పర్యటన ముగించుకొని 30వ తేదిన మంత్రాలయానికి చేరుకుంటారని మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు.

గోనెగండ్లలో వర్షం



గోనెగండ్లలో కురుస్తున్న వర్షం

గోనెగండ్ల, మే 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలతో పాటు గాజులదిన్నె, హెచ్ కైరవాడి, అలువాల, కులుమాల గ్రామాలలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపుతో కూడిన వర్షం కురిసింది. దీంతో వీదులు జలమయం అయ్యాయి పలు వీదులలో వర్షం నీరు పారడంతో జనానికి ఎండ వేడిమి నుంచి కొంత ఉపశమనం కలిగింది. మండు వేసవిలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షం కొంత ఊరటనిచ్చిందని భూమి చల్లబడిందని ప్రజలు తెలుపుతున్నారు. రెండు మూడు రోజులు వాతావరణం చల్లగా ఉంటుందని ప్రజలు తెలుపుతున్నారు. దిగువ ప్రాంతంల్లోని ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది.



వీధుల్లోకి చేరిన వర్షపు నీరు

ఎమ్మిగనూరులో 4.6 మి.మీ వర్షపాతం

ఎమ్మిగనూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలో 4.6 మీ.మీ వర్షాపాతం నమోదైనట్లు ఏఎస్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడిందన్నారు. మరో రెండు, మూడు రోజుల పాటు వరాల్షు పడే అవకాశం ఉందన్నారు. గత ఐదు రోజులుగా ఓ మోస్తారు వర్షం కురీయడంతో మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులు పంటలను సాగుచేసేందుకు సిద్ధమయ్యారు.

వాహనాల వేలం

కోసిగి, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తున్న కేసులతో పాటు వివిధ కేసుల్లోనూ పట్టుబడిన వాహనాలకు ఈ నెల 28న బుధవారం ఉదయం 10.30 గంటలకు కోసిగి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం పాట నిర్వహిస్తున్నట్లు కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు ఈ నెల 28న ఉదయం 10 గంటలకు ఆధార్, పాన్ కార్డు కాపీలతో వేలంలో పాల్గొనాలన్నారు. వేలాన్ని దక్కించుకున్నవారు నగదుతో పాటు జీఎస్టీ కలుపుకుని చలానా నగదును చెల్లించి వాహనాలు పొందవచ్చన్నారు.

గార్లదిన్నెలో విగ్రహ ప్రతిష్ఠ

ఎమ్మిగనూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని గార్లదిన్నె గ్రామంలో ఆదివారం సీతారామాంజనేయ స్వామి విగ్రహ, కళశ, ధ్వజస్థంభ ప్రతిష్టాపనలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి స్వామివారి విగ్రహాలకు ఆలయ అర్చకులు, జలాభిషేకం, కుంకుమార్చన, పుష్పాభిషేకం, మహాగణరాధన, మహామంగళ హారతి నిర్వహించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.


విద్యతోనే అభివృద్ధి సాధ్యం



ప్రతిభా పురస్కారాలు అందుకున్న వాల్మీకి విద్యార్థులు

ఎమ్మిగనూరు టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకిల అభివృద్ధి విద్యను అభ్యసించడం ద్వారానే సాధ్యమవుతుందని సీనియర్ ఉపాధ్యాయులు ఉసేని అన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని వాల్మీకి సంక్షేమ భవన్ అవరణలో వాల్మీకి ఉద్యోగ సంఘం అధ్వర్యంలో పదవ తరగతిలో ప్రతిభ చాటిన వాల్మీకి విద్యార్థులకు ఉత్తమ ప్రతిభ పురస్కారాలు అందజేశారు.ఈ సందర్భంగా ఉసేని,బాల వేంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడం వల్ల భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకొవడానికి ఆవకాశం ఉందన్నారు. ఈ ప్రోత్సహకాలే సామాజికంగా, ఆర్థికంగాను వెనుకబడిన వాల్మీకి సామాజిక వర్గాన్ని నాగరిక సమాజంగా తిర్చిదిద్ది వారిని అభివృద్ధి పథం వైపు పయనించేలా చేస్తుందన్నారు.అనంతరం జిల్లా స్థాయి ఉత్తమ ప్రతిభ కనబరిచిన బోయ కావ్యకి మొదటి బహుమతి రూ.10వేలు, రెండవ బహుమతి బోయ వరుణ్, బోయ సందీప్‌కు రూ.6వేలు, మూడవ బహుమతి బోయ కౌశిక్ రూ.4వేలు అందజేశారు.ఈ కార్యక్రమంలో శేఖర్, నరసయ్య నాగరాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వికసించిన మే పుష్పం



గోనెగండ్లలో వికసించిన మే పుష్పం

గోనెగండ్ల, మే 25(ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రమైన గోనెగండ్లలో మాజీ సర్పంచ్ రాఘవేంద్రనాయుడు ఇంట్లో మేనెల పుష్పం వికసించింది. ప్రతి ఏడాది మే నెల లోనే పుష్పం పూస్తుందని ఆయన తెలిపారు. ఈ పుష్పం చూడడానికి అందగా ఉండటంతో కాలనీ వాసులు పుష్పంను చూసేందుకు వస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మే 25 న వికసించిదని తెలిపారు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే ఈ పుష్పం పూస్తుందని అన్నారు.

నాడు అధ్వానం.. నేడు అద్భుతం

● కూటమి ప్రభుత్వంలో బాగైన రోడ్డు

● ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



వైసీపీ ప్రభుత్వంలో గుంతలు పడ్డ రైల్వే గేటు రహదారి (ఫైల్)



కూటమి ప్రభుత్వంలో వేసిన తారు రోడ్డు

కోసిగి, మే 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రోడ్లపై పడ్డ గుంతలను పూడ్చకపోవడంతో ఐదేళ్లుగా వాహనదారులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు... ప్రధాన రోడ్లపై పడిన గుంతలను పూడ్చేందుకు ప్యాచ్‌వర్కులు కూడా ఆనాడు చేయలేదు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో గుంతలు పడ్డ రోడ్లపై ప్యాచ్‌లు వేసి, కొత్త తారురోడ్డులను వేయడంతో ప్రయాణీకులు రోడ్లపై సాఫీగా ప్రయాణాలు సాగించి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. కోసిగిలోని వాల్మీకి సర్కిల్ నుంచి ఉరుకుందకు వెళ్లే హాల్వి రోడ్డు గుంతలమయమై ప్రమాదాలకు నిలయంగా ఉండేది. వర్షాకాలంలో అయితే.. మూడు అడుగుల మేర నీళ్లు చేరి చెరువుకుంటలను తలపించేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక రైల్వేగేటు సమీపంలోని రోడ్డుకు ప్యాచ్‌వర్కు పనులు పూర్తి చేయడంతో ప్రయాణీకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో గుంతలు పడిన రోడ్లలో బాధలు పడిన ప్రజలు కూటమి ప్రభుత్వంలో కొత్తగా వేసిన రోడ్లను చూసి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.

ఈ రోడ్డుకు మోక్షం కలిగేనా?

గోనెగండ్ల, మే 24(ఆంధ్రజ్యోతి): పెద్దనేటూరు, బురాన్‌దొడ్డి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు అధ్వానంగా మారిపోయింది. ముళ్ల కంపలు, గుంతలమయంగా మరిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నాయకులు ఎన్నికల సమయంలో హామీలు ఇస్తున్నారే తప్ప ఆ తర్వాత పట్టించుకోవడం లేదని ఇరుగ్రామాల ప్రజలు వాపోతున్నారు. వర్షకాలంలో రైతులు పొలలాకు ఎరువుల, తీసుకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముళ్లకంపతో ఇబ్బందిగా మారిన రహదారి